ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 23 అక్టోబరు 2024



కొబ్బరితోట

గుంజన జలపాతం



మరో కోనసీమ
రైల్వేకోడూరు

ఆహ్లాదకరమైన వాతావరణం.. పండ్ల తోటలు.. కొబ్బరి చెట్లు, పచ్చని పంట పొలాలు.. అత్యంత విలువైన, అరుదైన ఎర్రచందనం చెట్లు.. మామిడి, నిమ్మతోటలు.. అందమైన జలపాతాలు.. అబ్బురగొలిపే అడవులు.. ఎత్తయిన కొండలతో రైల్వేకోడూరు కోనసీమను తలపిస్తోంది. రైల్వేకోడూరు-తిరుపతి మార్గం పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉంటుంది. ఎర్రచందనం చెట్లు విస్తారంగా ఉన్నాయి. జలపాతాలు చూపరులను ఆకర్షిస్తాయి. నియోజకవర్గంలో మామిడి 25 వేల హెక్టార్లు, అరటి 10 వేల హెక్టార్లు, బొప్పాయి 12 వేల హెక్టార్లు, మిగిలిన పంటలు 10 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

- రైల్వేకోడూరు



రైల్వేకోడూరులో సాగవుతున్న వరి, (ఇన్‌సెట్లో) బొప్పాయి పంట



అడవి ఈత చెట్టు



అరటి తోట



మామిడి పంట



సావు కొనితెచ్చుకుంటిరి కదరా...

- చికిత్స పొందుతూ మరొకరు మృతి
- ఐదుకు చేరిన మృతుల సంఖ్య
- రోదనలతో అట్టుడికిన ఆసుపత్రి
- దూదేకులపల్లెలో విషాదఛాయలు



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల బంధువులు

పీలేరు/కలకడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'సావుకు వెళ్లి మీరు కూడా సావును కొనితెచ్చుకుంటిరి కదరా...మీరు లేకుండా మేము ఇళ్లకు ఎలా వెళ్లేది...పిల్లలకు ఏమని చెప్పేది' అంటూ సోమవారం రాత్రి కలకడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి బంధువుల రోదనలతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం అట్టుడికిపోయింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సోమవారం రాత్రి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు మండలం రేగళ్లు, కలికిరి మండలం టి.సంగ్రావారిపల్లె, దూదేకులపల్లె, చిత్తూరు జిల్లా నెల్లిమంద నుంచి వారి బంధువులు పెద్దఎత్తున పీలేరు ఆసుపత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పీలేరు ఆసుపత్రిలో గంభీర వాతావరణం నెలకొంది. కలకడ మండలం ఇందిరమ్మ కాలనీ వద్ద సోమవారం రాత్రి సీఎంఆర్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో కలికిరి మండలం దూదేకులపల్లెకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం, మరో నలుగురు గాయపడడం తెలిసిందే. దూదేకులపల్లెకు చెందిన బుజ్జమ్మ అలియాస్ ఖాదర్‌బీ (55), ఆమె అల్లుళ్లు ఖాదర్‌వలీ (30), నూరుల్లా (35), ఆమె వియ్యంకురాలు ఫకీరాబీ (60) అక్కడికక్కడే మృతి చెందారు. బుజ్జమ్మ భర్త ఎహసానుల్లా (60), ఆమె కుమార్తె దిల్‌షాద్ (25), దిల్‌షాద్ కుమార్తె సారా (4), వారి బంధువు అమ్మాజీ (26) తీవ్రంగా గాయపడడంతో వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దిల్‌షాద్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఎహసానుల్లా పరిస్థితి ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నప్పటికీ అమ్మాజీ, చిన్నారి సారా సురక్షితంగా బయటపట్టారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలకు పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ నేతృత్వంలోని వైద్యుల బృందం పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తక్షణ అవసరాల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆయన సాయం అందించారు.

దూదేకులపల్లెలో విషాద ఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో దూదేకులపల్లెలో మంగళవారం విషాదఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కూలీలైన బుజ్జమ్మ అలియాస్ ఖాదర్‌బీ, ఎహసానుల్లా ఆ గ్రామంలో అందరితో మంచిగా ఉండేవారు. వారికి నలుగురు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె అత్త మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుటుంబసమేతంగా సంబేపల్లె మండలం వంగిమళ్లకు సోమవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మృత్యువాతపడ్డారు. ఈ ప్రమాదంలో బుజ్జమ్మతోపాటు ఆమె చిన్న కూతురు దిల్‌షాద్, ఆమె భర్త ఖాదర్‌వలీ, మరో అల్లుడు నూరుల్లా, అతని తల్లి ఫకీరమ్మ మృతి చెందారు. వీరిలో బుజ్జమ్మ, దిల్‌షాద్, ఖాదర్‌వలీలను దూదేకులపల్లెలో ఖననం చేశారు. నూరుల్లా, ఫకీరమ్మలను వారి స్వగ్రామమైన చిత్తూరు జిల్లా నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లెకు తరలించారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

కలకడ వద్ద ప్రమాదానికి కారణమైన సీఎంఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్, కడప జిల్లా పెండ్లిమర్రి మండలం నందిమండలానికి ఆర్.ఉత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు కలకడ సీఐ గురునాథ్ తెలిపారు. బస్సును అతివేగంగా నడుపుతూ ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నట్లు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

పాపం చిన్నారి సారా...

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులైన దిల్‌షాద్, ఖాదర్‌వలీలను పోగొట్టుకున్న మూడున్నరేళ్ల సారాను చూసిన అందరూ కంటతడి పెట్టారు. తల్లిదండ్రులిద్దరూ ప్రమాదంలో మరణించారన్న విషయం అర్థం కాక ఆ చిన్నారి రోదిస్తున్న తన బంధువుల వంక అమాయకంగా చూసిన చూపులు అందరినీ కలిచివేశాయి.



ఉమ్మడి జడ్పీ కార్యాలయంలో బుధవారం ఓ విశేషం చోటు చేసుకోనుంది. జడ్పీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ సమావేశానికి మహిళామణులు సారథ్యం వహించనున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, జడ్పీ సీఈవో ఓబులమ్మ ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. మహిళల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో అయినా.. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మహిళామణుల సారథ్యంలో...
నేడు జడ్పీ సమావేశం

- సమస్యలపై చర్చ సాగేనా
- వ్యవసాయాన్ని గట్టెక్కించేనా
- పంటనష్టంపై ఊరట కలిగేనా
- తాగునీటి స్కీంల పనితీరు మెరుగుపడేనా
- నేతల గళంపై జనం గంపెడాశ

కడప రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన నిర్వహించనున్నారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలపై గళం విప్పి పరిష్కారం చూపుతారని భావిస్తున్నారు.

2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో బాధిత రైతులు వాటిని పశువులకు వదిలేశారు. దాదాపు 3,509 హెక్టార్లలో పంటలు ఎండిపోగా ఇందులో 2,858 హెక్టార్లలో మినుము, 651 హెక్టార్లలో వేరుశనగ ఉన్నట్లు వ్యవసాయాధికారులు నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

అలాగే అక్టోబరు 15 నుంచి విస్తారంగా వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ చివరిదశలో నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న వరి, మినుము, మొక్కజొన్న పంటలు 1,132 మంది రైతులకు సంబంధించి 2241.66 ఎకరాలలో దెబ్బతిన్నాయి. ఇలా ఖరీఫ్‌లో అనావృష్టి, అతివృష్టి వర్షాల కారణంగా మొత్తంగా 10,941 ఎకరాలలో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇలాంటి తరుణంలో ఖరీఫ్ కష్టాలను వెంటబెట్టుకొని రబీ సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతకు అవసరమైన రుణాలను బ్యాంకు అధికారులు సకాలంలో అందించకుండా మీనమేషాలను లెక్కిస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు పూర్తిస్థాయిలో ఇసుక ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. పైగా ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపు సాగుతున్నప్పటికి అధికారుల చర్యలు కానరావడం లేదు. భవననిర్మాణ రంగం కుదేలు కావడంతో పనులులేక కూలీలు వలసబాట పట్టారు. ఇక జిల్లాలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ కాలువలు శుభ్రపరిచేవారే కరువయ్యారు. వెరసి ప్రజలు దోమకాటుకు లోనై విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు చాలా వరకు పాఠశాలలు ఉరుస్తున్నాయి. వైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. వీటన్నింటిపై చర్చసాగించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రజాప్రతినిధులపై ఎంతైనా ఉంది. కానీ పై సమస్యలపై...

మిగతా 6వ పేజీలో..



కడప జిల్లా పరిషత్ కార్యాలయం

కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- విద్యార్థినిని పరామర్శించిన ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, డీఈవో



బాలికను పరామర్శించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే, డీఈవో

రామసముద్రం/మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని కేజీబీవీ విద్యాలయంలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... కేజీబీవీలో ఆ విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవుల్లో ఇంటికి వెళ్లిన ఆ విద్యార్థిని సెలవుల తర్వాత తాను హాస్టల్‌లో ఉండి చదవలేనని, ఇంటి నుంచి వెళ్లి చదువుకుంటానని మొండికేసింది. అయితే తల్లిదండ్రులు హాస్టల్‌లో ఉంటూ చదువుకోవాలని కుమార్తెను శుక్రవారం విద్యాలయంలో వదిలి వచ్చారు. దీంతో మనస్థాపం చెందిన ఆ విద్యార్థిని సోమవారం రాత్రి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం మదనపల్లెకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మంగళవారం ఉదయం మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బాలిక తల్లిదండ్రులు తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని చికిత్స పొందుతోంది. ఈ మేరకు రామసముద్రం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి విద్యార్థినిని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మంగళవారం ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీఈవో శివప్రకాశ్‌రెడ్డిలు చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు.

రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచాలి

- సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖ ప్రతిష్ఠను పెంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాయచోటి డివిజన్ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా చదివి తీసుకోవాల్సిన చర్యపై ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. రెవెన్యూ చట్టాలు.. విధులను బాధ్యతగా అమలు చేయాలని, అమలులో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలైనపుడే ప్రజలకు రెవెన్యూశాఖపైన, ప్రభుత్వంపైన నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. అంశాల వారీగా సమీక్షలో భాగంగా సీఎంవో కార్యాలయం నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, పరిష్కరించినవి, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్‌కు గల కారణాలపై మండలాల వారీగా తహసీల్దార్లతో సమీక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యపై ఫిర్యాదు అందగానే అది మన పరిధిలో ఉందా లేదా పైస్థాయిలో ఉందా అని అర్థం చేసుకుని ఆ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని, అవసరమైనప్పుడు నోటీసు ఇచ్చి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి పన్ను వసూళ్లను, నీటి వినియోగదారుల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పౌర సేవలకు సంబంధించి సిటిజన్ చార్టర్ ప్రకారం కుల, ఆదాయం, నివాస, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మొదలైన ధృవపత్రాలను ద్వారా నిర్ణీత కాలంలోపు జారీ చేయాలని, అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని తెలిపారు. శ్మశాన వాటికలకు సంబంధించి స్థలం నిమిత్తం దరఖాస్తులు వస్తే వాటిని త్వరగా పరిష్కరించాలని, ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా సంస్కరణలను పటిష్ఠంగా అమలు చేసి వాటి ఫలాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, జిల్లా సర్వేశాఖ ఏడీ భరత్ కుమార్, రాయచోటి డివిజన్ తహసీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


తోలుబొమ్మలాట


రావణుడితో వాదులాడుతున్న హనుమంతుడు

కనుమరుగవుతున్న ప్రాచీన కళలు
ఆదరణ కోల్పోతున్న కళాకారులు
ప్రత్యామ్నాయం వైపు అడుగులు
తొలి ప్రధాని మెచ్చిన ప్రాచీన కళ



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జానపద కళారూపం తోలుబొమ్మలాట భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. చర్మంతో తయారు చేసిన వివిధ బొమ్మలతో కథని తయారు చేసి జానపద కావ్యాలు, పురాణాల్లోని పాత్రలను సృష్టించుకుని తన భాషతో మూగచిత్రాలకు ప్రాణం పోశారు. చూపరులను అబ్బురపరిచేలా వాటిచేత రకరకాల విన్యాసాలు చేయించారు. తెరవెనుక ఉండి పాత్రలను కదిలిస్తూ జీవంలేని బొమ్మలతో జీవనిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడంలో జానపదుడి కళాత్మకం దాగివుంది. క్రీస్తుపూర్వం 3వ శతాబ్ధంలో తోలుబొమ్మలాటలు ఎక్కువగా ప్రదర్శించబడేవి. అప్పటి జనుల వేడుకలో తోలుబొమ్మలాట ఒకటి. ప్రాచీన కాలంలో తోలుబొమ్మలాటకు మంచి ప్రాధాన్యత, కళాకారులకు ప్రోత్సాహం, ఆదరణ ఉండేది. అప్పట్లో తోలుబొమ్మలాట బహుళ ప్రజాదరణ పొందింది. విజయనగర రాజుల కాలంలో కాలుడు అనే గొప్ప తోలుబొమ్మలాట కళాకారుడు ఉండేవాడని, ఆటలో అందె వేసిన వారని పెద్దలు చెబుతుండేవారు. ఆయన నైపుణ్యాన్ని చూసిన ఓ కవి తన కవిత్వాన్ని అతనికి అంకితం ఇచ్చాడంటే అప్పటి కాలంలో తోలుబొమ్మలాటకు ఆదరణ ఎంత ఉండేదో ఇట్టే అర్థమవుతోంది. తోలుబొమ్మలు ప్రదర్శించడంలో అనేక కొత్త పద్ధతులు కనిపెట్టి ప్రజల మన్ననలు పొందేవారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళపట్ల ఆసక్తి కనబరచడంతో రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో అప్పటి కళాకారులు ఢిల్లీకి వెళ్లి ప్రధాని ఎదుట ప్రదర్శనలు ఇచ్చారుట. తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎడ్ల బండ్లలో వెళ్లి వీక్షించేవారు. టీవీలు, సినిమాలు వచ్చిన తరువాత వాటి ప్రాధాన్యత తగ్గడమే కాక ప్రాచీన కళలు కనుమరుగై పోతున్నాయి. కదిలే తోలుబొమ్మల ప్రదర్శన గురించి తెలుసుకోవాలంటే తాతయ్య, అమ్మమ్మను అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి.


తోలుబొమ్మలను చూపిస్తున్న కళాకారుడు

కడప జిల్లాలో సుమారు 50 ఏళ్లకు ముందు కలసపాడు మండలం శింగరాయపల్లె నుంచి 40 కుటుంబాలకు పైగా పోరుమామిళ్ల ప్రాంతానికి వలస వచ్చి నివాసం ఉంటూ ప్రదర్శనలు ఇస్తుండేవారు. ఎక్కువగా భారతం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవ వధ, కర్ణపర్వం, ధృవపర్వంలాంటి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఎక్కువగా కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రతి ప్రదర్శనలో ఉండేలా వీరు నాటకాన్ని తీర్చిదిద్దేవారు. కేతిగాడి చిలిపి చేష్టలు, వారి మాటలకు జనాలు ఆనందంగా నవ్వుకునేవారు. చరిత్ర ప్రసిద్ధి గాంచిన తోలుబొమ్మలాట దేశ విదేశాల్లో సైతం ప్రజాదరణ పొందిందనడంలో అతిశయోక్తి లేదు. ఆ కళాకారులకు విదేశీయులతో సత్సంబంధాలుండడంతో విదేశాల్లో కూడా ఈ కళాకారులు వెళుతుండేవారు. ప్రాచీన ఓడరేవులైన భీమునిపట్నం నుంచి వ్యాపార నిమిత్తం భారతీయ వర్తకులు విదేశాలకు వెళుతుండేవారు. వీరితో కలిసి బొమ్మలాట కళాకారుల బృందాలు కూడా వెళ్లేవి. ఇలా విదేశాల్లో తోలుబొమ్మలాట ప్రచారానికి వచ్చిందని తెలుస్తోంది. 17వ శతాబ్ధం నాటి పారిస్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో ఈ ఆటకు ఆదరణ దక్కింది.

తోలుబొమ్మల తయారీ...

చర్మాలను నిలువునా సాగదీసి వాటిని ఎండబెట్టి భద్రపరిచి బొమ్మల అవయవాలు కదిలేలా భాగాలు కత్తిరించి కదిలేందుకు అనువుగా అమర్చుతారు. దీంతో ప్రజలు చక్కని వినోదం పొందేవారు. తోలుతో బొమ్మలు చేసి ఆడించడంతో తోలుబొమ్మలాటగా పేరు వచ్చింది. సంస్కృతంలో ఛాయానాటకంగా పిలుస్తారు. బొమ్మలాట తెరకు వెలుతురు కనబడని ముతక వస్త్రాన్ని ప్రత్యేకంగా ఉపయోగించేవారు. దాదాపు 24 అడుగులు తెర వెనుక 12 అడుగుల ఖాళీస్థలంలో వాయిద్య కళాకారులు పాటలు పాడేవారు. ప్రదర్శన కోసం అప్పట్లో ఆముదపు దీపాలు, కాగడాలు ఉపయోగించేవారు. కాలక్రమేణా ఎరుపు ట్యూబులైట్లతో బొమ్మలను ఆడించేవారు. బొమ్మకు కొక్కీలు ఏర్పాటు చేసి కళాత్మకంగా బొమ్మలను ఆడిస్తూ వినోదం అందించేవారు.

తగ్గిన ఆదరణ

తోలుబొమ్మలాటకు రానురాను ఆదరణ తగ్గింది. అప్పుడప్పుడూ టీవీల్లో ఆదివారం ప్రత్యేకించి ఈ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇప్పుడు చూడాలంటే ఏ తెలుగు మహాసభల కోసమో, సాంస్కృతిక చిహ్నంగా ప్రదర్శిస్తుంటారు. ప్రస్తుతం కాలగర్భంలో కలిసిన గ్రామీణ కళల జాబితాలో చేరుతోంది. తోలుబొమ్మలాట కళాకోవిదుల బతుకుదెరువుపై గీతాలాపనే ఇప్పుడిక మిగిలింది. మహోన్నత చరిత్ర కలిగి దేశ విదేశాల్లో ఆహ్లాదం, వినోదం అందించిన తోలుబొమ్మలాటలు నేడు పూర్తిగా కనుమరుగయ్యాయి. వాటిని నమ్ముకున్న కళాకారులు వీధిన పడ్డారు. సరైన ఆదరణ లేకపోవడంతో తోలుబొమ్మలు ఆడించి పొట్ట పోసుకుని జీవనం సాగించే కళాకారులు వీధినాటకం ఆడే భాగవతులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడ్డ సమాజం గతంలో తోలుబొమ్మలాట ఉందనే విషయం కూడా మరిచారు. రాజులను సైతం మైమరిపించిన ఈ ఆటను తిరిగి తెరపైకి తెచ్చేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదనడంతో సందేహంలేదు.

ప్రభుత్వ పథకాల్లో ప్రచారం...

ప్రభుత్వ పథకాల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం ఇచ్చారు. కళనే నమ్ముకున్న కొందరు కళపై మక్కువను వదులుకోక తిరుణాళ్ల, జాతర వంటి క్షేత్రాల్లో గ్రామస్తుల కోరిక మేరకు ప్రదర్శనలు ఇస్తున్నారు. మహా భారతం, రామాయణం, ప్రమీలార్జునీయం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవవధ, కర్ణపర్వం, ధృవ పర్వం ప్రదర్శనలు ఇచ్చేవారు. కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రదర్శనలో కీలకంగా ఉండేవారు. ముఖ్యమంత్రి ద్వారా అవార్డులు కూడా అందుకున్నారు.

తొలి ప్రధాని మెచ్చిన కళ

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళ గురించి విని ఆసక్తి కనబరచడంతో అప్పటి కళాకారులు ఢిల్లీలో ప్రదర్శనలు ఇచ్చారు. రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో వెంకట్రావు, సుబ్బారావు, గోవిందరావు. రామోజీరావు, క్రిష్టారావు, ఎరికలమ్మ, జానకమ్మ బృందం ఢిల్లీలోని సర్వదేవాపురం వద్ద పద్మ యాగం, సైంధవవధ బొమ్మలాట ప్రదర్శించారని అప్పటి కళాకారులు చెబుతున్నారు. ఈ కళకు ఉన్న ఆదరణ గురించి తోలుబొమ్మలాట కళాకారిణి జానకమ్మ ఓ పత్రికలో తన జ్ఞాపకాలను నెమరువేసుకుందని వనపర్తి పెద్దమునిరావు తెలిపారు. ఆమెకు చదువు రాక పోయినా రామాయణం, భాగవతమట్టాలు ఆకట్టుకునేలా కథనం చెప్పేవారు. ప్రధాని నెహ్రూ కళాకారుల ప్రదర్శనలు వారం రోజులు వీక్షించి వారిని ఆదరించారని ఇప్పటి కళాకారులు తెలిపారు.

50 ఏళ్లుగా ఈ వృత్తిలోనే..



50 ఏళ్లుగా తోలుబొమ్మలాటనే నమ్ముకుని ఉన్నాం. తోలుబొమ్మలాట ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చే వారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానం అందితే గ్రూపు సభ్యులు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చి, వారిచ్చే కానుకలను స్వీకరించే వారం. జన్మభూమి, కడప వారోత్సవాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను ఎంతో ప్రోత్సహించే వారు. ఇప్పటికైనా కళాకారులను ఆదరించి ప్రాచీన కళలకు ప్రాణం పోసేలా చర్యలు తీసుకోవాలి.

- వనపర్తి పెద్దమునిరావు, ఎస్టీకాలనీ, రంగసముద్రం, పోరుమామిళ్ల

కళాకారులకు తగ్గిన ఆదరణ



తోలుబొమ్మలాట కళాకారులకు నేడు ఆదరణ లేదు. తమ కళలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వయోభారంతో పని చేయలేక తరతరాలుగా వస్తున్న వృత్తిని వదలుకోలేక కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం కార్యక్రమానికి వెళితే గ్రూపునకు రూ.15వేలు ఇస్తున్నారు. ఆ డబ్బుతోనే జీవిస్తున్నాం. కళాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది.

- నరసింహులు, ఎస్టీకాలనీ, పోరుమామిళ్ల


అప్పటి సీఎం చంద్రబాబు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న పెద్ద మునిరావు (ఫైల్)



తోలుబొమ్మలాట కళాకారుల ర్యాలీ - తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వద్ద తోలుబొమ్మలాట ప్రదర్శించిన జానకమ్మ (ఫైల్)

మహిళామణుల సారధ్యంలో...

నేడు జడ్పీ సమావేశం

(5వ పేజీ తరువాయి)

ఎంతమేర చర్చజరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రజలు మాత్రం జిల్లాలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

శాఖల వారీగా పరిశీలిస్తే...

- 2024 ఖరీఫ్ పంటలకు కష్టకాలం దాపురించింది. నైరుతి రుతుపవనాలు అసమతుల్య వర్షాలను కురిపించడంతో వర్షాధారం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 299.5 మి.మీ మాత్రమే నమోదవడంతో చాలా వరకు పంటలు ఎండిపోయాయి. ఇప్పటికే వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు పశువులకు వదిలేశారు. 2024 ఖరీఫ్‌లో 75,189 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా 51,518 హెక్టార్లు మాత్రమే సాగుకు నోచుకున్నాయి. ఇందులో వర్షాభావ పరిస్థితుల కారణంగా 8,700 ఎకరాలు, అతివృష్టి వర్షాల కారణంగా 2,241 ఎకరాల్లో పంటలు దెబ్బతిని రూ.కోట్లలో పంట నష్టం వాటిల్లడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన నష్టపరిహారం, పంటల బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీలు జిల్లా రైతులకు సక్రమంగా అందడంలేదు. వీటిపై ప్రధానచర్చ జరగాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలోని బాల, బాలికల వసతిగృహాల నిర్వహణకు మంజూరైన నిధులు ఖర్చు చేస్తున్నా 60శాతం వసతి గృహాల్లో తాగునీరు ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. బీసీ సంక్షేమం ద్వారా బీసీ, ఈబీసీ విద్యార్థులకు గతేడాదికి సంబంధించిన పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్పులు చాలా మందికి విడుదల కావాల్సి ఉంది. మైనార్టీ సంక్షేమం కింద ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన ఐసీడీఎస్ అధికారులు దాన్ని పూర్తిగా మరిచిపోయారనే ఆరోపణలున్నాయి. వీటిపై చర్చ జరగాల్సి ఉంది.
- జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్ స్కీంల పనితీరు లోపభూయిష్టంగా మారింది. వీటికి సంబంధించి ఇటీవల జరిగిన టెండర్లు నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టానుసారం చేపట్టారనే ఆరోపణలున్నాయి. వర్షాలు కురుస్తున్నా జిల్లాలో చాలా చోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కడప నగరంలో ఐదురోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో వాటర్‌స్కీంపై సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ నీటివనరుల నిర్మాణాలున్నాయి. ఇందులో 1,841 చిన్ననీటిపారుదల వనరుల ద్వారా 1,11,225 ఎకరాల ఆయకట్టు, 4 మధ్యతరహా నీటిపారుదల వనరుల ద్వారా 59,955 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ అయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. రూ.18 కోట్ల జైకా నిధులతో చేపడుతున్న బుగ్గవంక ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు ఏళ్లతరబడి నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపైనా, కేసీకెనాల్, పులివెందుల బ్రాంచ్‌కెనాల్, తెలుగుగంగకు నీటి కేటాయింపులపైనా చర్చసాగాల్సి ఉంది.

మొరవ పోతున్న బాలంవారిపల్లె ప్రాజెక్టు

- అప్రమత్తమైన పోలీసులు, రెవెన్యూ అధికారులు



పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు గార్గేయ నదిలో ప్రవాహం పెరిగి నీరు బాలంవారిపల్లె ప్రాజెక్టులోకి అధిక మోతాదులో చేరుతోంది. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె ప్రాంతంలో రెండు చెరువులకు గండ్లు పడడడంతో నీటి ప్రవాహం పెరిగింది. ఆ నీరంతా ప్రాజెక్టులోకి చేరి నిండడంతో మంగళవారం సాయంత్రం మొరవ పోయింది. ఆ నీరంతా ప్రాజెక్టు దిగువన ఉన్న పింఛా నదిలో చేరడంతో పీలేరు మండలం బాలంవారిపల్లె వద్ద నది ప్రవాహం పెరిగింది. దీంతో పీలేరు మండల పోలీసు, అధికారులు అప్రమత్తమయ్యారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని మహిళలు, పశువుల కాపరులు నది వైపు వెళ్లవద్దని వారు హెచ్చరికలు జారీ చేశారు. బాలంవారిపల్లె ప్రాజెక్టుతోపాటు బాలంవారిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె వద్దనున్న బ్రిడ్జీని పీలేరు ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రాత్రి పూట ఎవరూ నదిని దాటేందుకు ప్రయత్నించకూడదని పరిసర గ్రామాల్లో చాటింపు వేశారు.

ఆకతాయిలనుంచి బైక్‌లు స్వాధీనం

- తల్లితండ్రులు సహా యువతకు సీఐ కౌన్సెలింగ్


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజారెడ్డి

బి.కొత్తకోట. అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాలేజీల పరిసరాల్లో అడ్డదిడ్డంగా బైక్‌లు నడుపుతూ అమ్మాయిలను టీజింగ్ చేయడం, ట్రిబుల్‌రైడింగ్‌తో బైపాస్‌రోడ్డులో స్టంట్‌లు చేసే ఆకతాయి యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి బైక్‌లను సైతం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకుల తల్లితండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వడం నేరమని, తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, వాహనం ఎలా నడుపుతున్నారు, అని గమనించాల్సిన బాధ్యత తల్లితండ్రులపై వుండాలని సీఐ రాజారెడ్డి హితవు పలికారు. కాలేజీలు వదిలిన సమయంలో కొందరు యువకులు ఆ ప్రాంతంలో అభ్యంతరకరమైన పనులు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న శివయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో టైలర్ శివయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని పీటీఎం రోడ్డులో కాపురం వుంటున్న శివయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి పొద్దు పోయాక మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబీకులు శివయ్యను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సలహా మేరకు ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందడంతో ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దౌర్జన్యం కేసులో ఇద్దరికి జరిమానా

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళపై దౌర్జన్యం చేసిన ఇద్దరికి పీలేరులోని స్పెషల్ కోర్టు న్యాయాధికారి జరిమానా విధించినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు కేవీపల్లె మండలం మద్దిపట్లవారిపల్లె పంచాయతీ అంగజాలవారిపల్లె వాసి వి.జయరామయ్య, చెన్నారెడ్డి కాలనీ వాసి ఇరగంరెడ్డి చెన్నారెడ్డి పద్మావతి నగర్ వాసి కొత్తపల్లె రత్నమ్మపై దౌర్జన్యం చేశాడు. ఆమె ఇంట్లోని రూ.40 వేలు విలువైన గృహోపకరణాలు ధ్వంసం చేశాడు. రత్నమ్మ ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేశారన్నారు. కేసు పీలేరులోని స్పెషల్ కోర్టులో విచారణ జరిగిందని, వారిపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి మురళీ వారిద్దరికీ చెరో రూ.6 వేలు జరిమానా విధించారన్నారు. లేని పక్షంలో ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష విధించారని సీఐ వివరించారు.

సప్లై చానెల్‌కు మరమ్మతులు

పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై చానెల్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సదుం, సోమల మండలాల్లో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో మండలాల్లోని చెరువులు తెగడం, ఆ నీరంతా గార్గేయ నది ద్వారా బాలంవారిపల్లె ప్రాజెక్టులో చేరుతుండడంతో ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారు. బాలంవారిపల్లె ప్రాజెక్టు నిండి మొరవపోతే ఆ నీరు పింఛానది ద్వారా కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్‌కు మళ్లించుకోవచ్చు. పింఛా నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు దారితీసే సప్లై చానెల్‌లో పొదలు, చెట్లు బాగా పెరగడంతో వాటిని తొలగిస్తూ చానెల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఈఈ గురుమోహన్ ఆదేశించారు.

ప్రతి పని వందశాతం గ్రౌండింగ్ కావాలి

- సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పశువుల షెడ్లు, పనులు త్వరితగతిన చేపట్టాలి
- పల్లె పండుగ వారోత్సవాల్లో కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ వారోత్సవాల్లో మంజూరైన ప్రతి పనిని యుద్ధ ప్రాతిపదికగా వందశాతం గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఈఓ పీఆర్‌డీఓలు, పీఆర్ ఇంజనీర్లు, ఉపాధి హామీ ఏపీఓలు, పంచా యతీ సెక్రటరీలు తదితరులతో నిర్వహిం చిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించి గ్రామాలకు అవసరమైన రహదారులు, కాల్వలు, విద్యుత్, పశువుల షెడ్స్ తదితర మౌలిక వసతులు, ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పనతో గ్రామాల్లో స్థిరమైన ఆస్తులు ఏర్పరచాలని సంకల్పించిది. తద్వారా గ్రామాలన్నీ నూతన శోభను సంతరించుకోనున్నాయి. ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో జిల్లా మంత్రి వర్యులు, ప్రజాప్రతినిధులు పండుగలాగా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వారోత్సవాల్లో భాగంగా 722 అంతర్గత సీసీ రోడ్లకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఆయా మండలాలకు మంజూరు చేసినవి, భూమి పూజ, పని మొదలైనవి, ప్రారంభం కానివి తదితర వివరా లు, కారణాలు ఆయా ఎంపీడీఓల ను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో వెంటనే పనులు మొదలు పెట్టాలని, డిసెంబరు 31లోగా అన్ని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది వల్ల మంజూరైన పనిని రద్దు చేయాల్సి వస్తే ఆ పని విలువకు తగిన విధంగా మరోచోట పనిని మొదలు పెట్టాల ని సూచించారు. పనులు చేపట్టడానికి అవసరమైన ఇసుకను స్థానిక వాగులు, వంకలు ఎక్కడ లభ్యత ఉంటే అక్కడి నుంచి ప్రభుత్వ అనుమతించిన రీచుల నుంచి తీసుకెళ్లవచ్చన్నారు. లేబర్ బడ్జెట్ జనరేషన్‌లో కేవీపల్లి, మదనపల్లె, నిమ్మపల్లె, వాయల్పాడు వనుకబడి ఉన్నాయని, ఆయ మండలాల్లో ప్రగతిలోకి తీసుకురావలని సూచించారు.

బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



కురబలకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తెట్టు పంచాయతీ పూజారివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ, దశరథ తన వాహనంలో అంగళ్ళుకు పొంతపనుల నిమిత్తం వచ్చారు. కాగా బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు వెళ్ళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటరమణ పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దమండ్యం, అకోటబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం పెద్దమండ్యం, ఎన్‌ఓ పల్లి, కలిచెర్లలో పక్కా గృహాల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. దశల వారిగా మండలంలో జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్‌లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ ఏఈ అక్రమ్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రామసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనాధ శవానికి గ్రామస్తులు అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. దినసరి మార్కెట్ షెల్టర్‌లో కొంతకాలంగా ఓ వృద్ధ అనాద ఉండేవాడు. ఇతనికి అక్కడి వ్యాపారులు రోజూ భోజనం పెట్టేవారు. కాగా సోమవారం రాత్రి ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. పంచాయతీ సెక్రటరీ నాయక్ గ్రామస్తులు కలిసి అంత్యక్రియలు జరిపించారు.

మీడియా అవార్డు-2024కు ఎంట్రీలు ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ఓటర్లలో చైతన్యం, అవగాహన ప్రచారంలో ఉత్తమ కృషి చేసిన మీడియాకు అవార్డులను ప్రధానం చేసేందుకు వివిధ మీడియా సంస్థల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోందని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా (టెలి విజన్, రేడియా), ఆన్‌లైన్ (ఇంటర్నెట్, సోషల్) రంగాల్లో ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంపొందించేందుకు కృషి చేసిన వారికి రంగానికి ఒక అవార్డు వంతు భారత ఎన్నికల సంఘం 2021 నుంచి ఏటా అవార్డులు అందిస్తోందన్నారు. 2024 ఏడాదికి సంబంధించి 2025 జనవరి 25వ తేదీ జాతీయ ఓటరు దినోత్సవం రోజున ఈ అవార్డులను ప్రధానం చేయనుందన్నారు. అవార్డు కింద ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించనున్నారని సీఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెళకువలను పాటించాలని వ్యవసాయ ఏడీఏ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం పోతబోలులో పొలం పిలుస్తోంది లో భాగంగా రైతులకు పలు పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఎక్కువగా ఎరువులను వాడడం వలన భూమి రొట్టలు పడుతుందన్నారు. ఏఓ నాగప్రసాద్,ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ నవ్యజ్యోత్స్న, వెంక టేశ్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

అతి కష్టంగా ఆరు కిలోమీటర్లు


బెంగళూరు బస్టాండ్‌లో నడిరోడ్డుపై గుంతలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు22: (ఆంధ్రజ్యోతి) మదనపల్లె పట్టణం నడుబొడ్డు నుంచి నాలుగువైపులా ఆ ఆరు కిలోమీటర్లు ప్రయాణం అతికష్టమౌతోంది. పట్టణం నుంచి పుంగనూరు రోడ్డు జాతీయ రహదారి వరకు, పట్టణం నుంచి వేంపల్లె క్రాస్ రోడ్డు వరకు. సీటీఎం రోడ్డు నుంచి తట్టివారిపల్లె బైపాస్ వరకు. చిత్తూరు బస్టాండ్ నుంచి పెంచుపాడు రోడ్డు లాభాల గంగమ్మ ఆలయం వరకు ఉన్న తారు రోడ్డు పాడైపోయాయి. రోడ్డుపై కొన్ని చోట్ల చెరువులను తలపించేలా గుంతలు పడ్డాయి. దీంతో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకులు వళ్లు హూనం చేసుకుని ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా మరిపోయాయి. బెంగళూరు బస్టాండ్ ఇందిరమ్మ కూడలిలో పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరుకూడా అక్కడే నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. బెంగళూరు రోడ్డులోని దర్గా వద్ద, పప్పిరెడ్డిగారిపల్లె వద్ద, చిప్పిలి మిల్క్‌డైరీ వద్ద, చిప్పిలిలో, వేంపల్లె క్రాస్ వరకు రోడ్డు మొత్తం గుంతలే కనిపిస్తాయి. చిత్తూరు బస్టాండ్ నుంచి బాకావానితోపులో రోడ్డు పూర్తిగా గుంతలమైయమైంది. చిత్తూరు బస్టాండ్ నుంచి పుంగనూరు రోడ్డులో మిషన్ కాంపౌండ్ ముందర, ఎంఎల్ఎల్ ఆస్పత్రి వద్ద, నిమ్మనపల్లె క్రాస్, నెమలి కల్యాణమండపం, బోర్డు, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు పాడైపోయింది. ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలనంటే నరకయాతన తప్పదు మరి.

బడి భోజనం.. ప్రక్షాళన



- పథకంలో మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- ఎస్ఎంసీ సూచనలు పరిగణనలోకి...

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో విద్యార్థులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అసలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. రుచితో పాటు ఇష్టపడని కూరల కారణంగానే విద్యార్థులు బడి భోజనంపై అయిష్టత చూపుతున్నట్లు ఎప్పటి నుంచో ఉంది. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా బడిలోనే భోజనం చేసేలా కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులకు సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్థమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1748, ఉన్నత, హైస్కూలు ప్లస్ పాఠశాలలు 306 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ వరకు 1.47 లక్షలు మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాల గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపధ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల సమీక్ష నిర్వహించింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు - భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ (ఎస్ఎంసీ) నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేయగా అందులో మేలైన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్న భోజనం పథకంలో మార్పులు చేసేందుకు సిద్ధమైంది.

కమిటీ సూచనలు ఇలా...

- మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలి
- పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారి మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలి కూడా చాలా మంది విద్యార్థులు తినడం లేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండడం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు, లేదా పాలు ఇవ్వాలి.
- కడప కార్పొరేషన్ పరిధిలో ఇస్కాన్ సంస్థ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తుంది. ఈ సరఫరాలో భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడంలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా అరటిపండు ఇస్తున్నారు. దీనిపై కూడా ఇంకా మెరుగైనది ఇస్తే బాగుంటుంది.
- ఏజన్సీలకు ఏ నెలకు ఆ నెల బిల్లులు చెల్లించడం లేదు. అప్పు లు చేయాల్సి వస్తోంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజన్సీలకు అప్పులబాధ తప్పుతుంది.

అయితే... నాకేంటి?

- విద్యుత్ శాఖలో ఓ ఉద్యోగి లంచావతారం
- పనుల కోసం వెళ్లే ప్రజలకు తప్పని పాట్లు
- సమస్యలు పరిష్కారం కాక రైతన్నలూ సతమతం

విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అవినీతి దాహం తారాస్థాయికి చేరింది. విద్యుత్ సంబంధిత పనులు, సమస్యలపై ఎవరైనా ఆయనను ఆశ్రయిస్తే.. 'అయితే నాకేంటి' అంటూ రాజేంద్రప్రసాద్ అహనా పెళ్లంట సినిమాలో సిగ్గులేకుండా లంచం డిమాండ్ చేసినట్లు చేస్తున్నాడు. చేయి తడపందే పని జరుగదని నిర్మొహమాటంగా చెబుతున్నాడు. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఈ ఉద్యోగి నిర్వాకంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.





తెగిపోయి పొలాల్లో పడిన విద్యుత్తు వైరు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గృహ అవసరాలకు, వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్తు పనుల కోసం వెళ్లే ప్రజలను ఆమ్యామ్యాలు సమర్పించాల్సిందేనని కరాఖండిగా చెబుతున్నాడు. దీంతో విసిగి వేసారిన ప్రజలు తిరుపతిలోని విద్యుత్తుశాఖ టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అయితే ఆ శాఖకు సంబంధించిన యూనియన్‌ను అడ్డం పెట్టుకుని సదరు ఉద్యోగి సమస్యల నుంచి సులువుగా గట్టెక్కుతున్నాడు. మండల విద్యుత్తు శాఖలోని సిబ్బందిలో నెలకొన్న అంతర్గత కలహాలు ప్రజలకు శాపంగా మారాయి. ఇటీవల దువ్వూరు పొలాల్లోని కుమ్మరోని మల్లు, గాజులోళ్లబావి సమీపంలో విద్యుత్తు వైర్లు తెగి కిందపడ్డాయి. ఈ సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లేకపోవడంతో వీరు ఆందోళనకు గురవుతున్నారు. వైర్లు తెగిపోవడంతో దువ్వూరు పొలాల్లోని 20 దాకా వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయి అయిదు రోజులుదాకా గడిచింది. దీంతో బోర్ల కింద పొలాల్లో వేసిన జొన్న, వరి, అనప, వేరుశనగ, అరటి, పసుపు లాంటి పంటలు నీటి తడులు అందక సంబంధిత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే కాలయాపన చేస్తే పంటలు ఎండిపోతాయని సంబంధిత రైతులు అధికారులపై ఆక్రోశం వెలుబుచ్చుతున్నారు. పంటల సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు కింద వెచ్చించామని ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులు వాస్తవమే..

తమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. శాఖాపరంగా పై అధికారుల నిర్ణయాల మేరకు నడుచుకుంటాం.

-బి.వీరారెడ్డి,
విద్యుత్తు శాఖఏఈ, దువ్వూరు

చెరువులో పడి వ్యక్తి మృతి



నిరసింహుడు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం సమీపంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి వనిపెంట నరసింహుడు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం నుంచి ఇతను కనిపించకపోవడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. చెరువు వద్ద చెప్పులు, ఇతర వస్తువులు కనిపించడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం చెరువులో ఇతని శవాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్యపై భర్త కత్తితో దాడి



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగ సముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్‌కాలనీలో వనపర్తి అంజలి అనే మహిళపై ఆమె భర్త నారాయణ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ మూర్తి వివరాల మేరకు.. వనపర్తి నారాయణకు అంజలితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. నారాయణ మద్యానికి బానిసై... అనుమానం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో భార్యపై మచ్చుకత్తితో దాడి చేయడంతో తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ తమిళ కూలీలు, దుంగలతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముడుంపాడు బీటు మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్ర మంగా 9 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా బేస్ క్యాంపు సిబ్బంది దాడులు నిర్వహించి తమిళనాడుకు చెందిన ఇద్దరు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యత అని.. కొత్త వ్యక్తులు ఎవరైనా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో రమేశ్‌బాబు, ముడుంపాడు బీట్ ఎస్బీవో అంజనాస్వాతి, గౌసియా, రమణ, శంకర్, రామయ్య, శేషు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ తెలపండి



కంచపు లోకేశ్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికమ్మపల్లికు చెందిన కంచపు లోకేశ్ (14) అనే బాలుడు అదృశ్యమయ్యాడని.. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. అడవికమ్మపల్లి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లోకేశ్ ఈనెల 21వ తేదీ స్కూల్‌లో ఐడీ కార్డు తీసుకోవాలని తన తండ్రి వద్ద రూ.500 డబ్బులు తీసుకొని వెళ్లినట్లు తెలియజేశారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలుడు తండ్రి రామయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు సబేపల్లె పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలుడు గురించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే.. 9121100566, 7981200671 సెల్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

మున్సిపాలిటీకి శాపంగా... వైసీపీ అసమర్థ పాలన


- సుందరీకరణ పేరుతో వందల కోట్లు వృథా
- పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు
- చేసిన పనులను మళ్లీ చేసిన గత ప్రభుత్వం
- విద్యుద్దీపాల సమస్య పరిష్కరించకుంటే ధర్నా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అసమర్థపాలనతో పులివెందుల మున్సిపాలిటీకి శాపంగా మారిందని, సుందరీకరణ పేరుతో వందలకోట్ల రూపాయలు వెచ్చించినా ఫలితం లభించలేదని పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టారని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్‌డీఏ కూటమి నాయకులు బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిలతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి తరలివెళ్లి మున్సిపల్ సమస్యలపై కమిషనర్, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపాలిటీల్లో విద్యుత్ దీపాలను ఆర్పి వేసి పట్టణాన్ని అంధకారంలోకి నెట్టడానికి కారణాలను అడిగారు. వారంలోగా విద్యుత్ దీపాల సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మీడియా సమావేశంలో రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 4800 విద్యుత్ దీపాలు ఉంటే.. పదిశాతం కూడా ప్రస్తుతం వెలగడం లేదన్నారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల పులివెందులలో దొంగతనాలు ఎక్కువయ్యాయన్నారు. పాలకమండలి చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వాస్తవాలు దాచిపెట్టి విద్యుత్‌దీపాలను వెలగనీయకుండా చేయడం, రెండు మూడు రోజులకు ఒకసారి మంచినీటిని విడుదల చేస్తున్నారన్నారు. ఇక 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి 2024 వరకు దఫదఫాలుగా చేసిన రింగు రోడ్డు సుందరీకరణ పనులను మళ్లీ మళ్లీ చేసుకుంటూ నిధులు వృథా చేశారన్నారు. ఇప్పటికి మున్సిపల్ పరిధిలో 150 వీధుల్లో అండర్ డ్రైనేజీ, సిమెంటు రోడ్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఆశలతో అధికారం ఇస్తే సొంత నియోజకవర్గానికి జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. పులివెందుల ప్రజలకు ఏ వార్డుకు ఎవరు కౌన్సిలరో కూడా తెలియని పరిస్థితి ఉండడం చూస్తే గత ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వారంలోగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌దీపాల సమస్యను పరిష్కరించకపోతే ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 3150 క్యూసెక్కులు విడుదల



కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి మంగళవారం 3150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3000 క్యూసెక్కులు, వరద నీరు మరో 150 క్యూసెక్కులు వచ్చి చేరినట్లు డీఈ తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చే నీటిని యధా తథంగా మైలవరం జలాశయానికి వదులుతున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టి... అటవీ సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళశారం జిల్లా అటవీ కార్యాలయంలో ఉప అటవీ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫారెస్టు ప్రొటెక్షన్ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

కోతి కరిచి మహిళకు గాయాలు

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న మాచుపల్లెలో మంగళవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న వెంకటసుబ్బమ్మ అనే మహిళను కోతి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు వైద్యశాలకు తరలించారు. ఇటీవల మూడేళ్ల బాలికను కోతి కరిచిందని.. గ్రామంలో కోతుల బెడద ఎక్కువైందని.. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రసవత్తరంగా... ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలు

- స్వల్ప స్కోర్‌కే కుప్ప కూలిన వెస్ట్ గోదావరి ● 316 పరుగుల భారీ స్కోర్ దిశగా కడప ● 162 పరుగులకే చేతులెత్తేసిన కర్నూలు



77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న శివప్రశాంత్



73 పరుగులు చేసిన ఫైజాన్ (కడప)



5 వికెట్లు తీసిన రేవంత్ (ఈస్ట్ గోదావరి)

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-14 మెన్స్ రెండు రోజుల మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా కేఓఆర్ఎం మైదానంలో విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.3 ఓవర్లలో కేవలం 112 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది.

తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 22.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 82 పరుగులు చేసింది. ఇందులో తమన్‌రెడ్డి 43 పరుగులతో, అక్షిత్‌రెడ్డి 35 పరుగులతో క్రీజ్‌లో వున్నారు.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 316 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో లోకేష్ 53, ఫైజాన్ 73 పరుగులు చేసి ఔట్ కాగా శివ ప్రశాంత్ 77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో

కర్నూలు-ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో 78.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 162 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 72 పరుగులు చేశారు. ఇక బౌలింగ్ విభాగంలో ఈస్ట్‌గోదావరి జట్టు బౌలర్ రేవంత్ 5 వికెట్లు పడగొట్టి గట్టి దెబ్బతీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. ఇందులో కార్తీక్ 28 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 98 పరుగుల వెనుకంజలో ఈస్ట్ గోదావరి జట్టు ఎదురీదుతోంది.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.కోటి

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ వివిధ ప్రాంతాలకు రాను, పోను సుమారు 390 ప్రత్యేక బస్సులను సమకూర్చామని వీటి ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు విజయవాడకు రాను పోను 53 బస్సులు, బెంగళూరుకు 128, హైదరాబాదుకు 99, చెన్నైకి 22, తిరుపతికి 51, కర్నూలుకు 8, ఇతర ప్రాంతాలకు మరో 29 బస్సులు తిప్పామన్నారు. మొత్తంగా 390 బస్సులు నడిపామని వీటిద్వారా రూ.1,02,84,721 ఆదాయం వచ్చిందని అన్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌కు తిప్పడం ద్వారా రూ.30,71,411 ఆదాయం రాగా.. బెంగళూరుకు తిప్పడం ద్వారా రూ.30,48,665 వచ్చిందన్నారు.

మద్యం మత్తులో దారుణ హత్య



గోపవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం శ్రీనివాసపురంలో మంగళవారం రాత్రి దారుణం జరిగింది. మద్యానికి బానిసై తరచూ తల్లితో గొడవపడుతున్న భాస్కర్‌రెడ్డి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తాగి ఇంటికి వెళ్లగా తల్లితో వాగ్వాదానికి దిగాడు. ఎంతసేపటికీ వినకపోగా తల్లి అక్కడి సమీపాన ఉన్న మరిది సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లింది. భాస్కర్‌రెడ్డి అదే కోపంతో సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి తన తల్లిని ఇంటికి పంపించాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపధ్యంలో దగ్గరలో ఉన్న కత్తెర తీసుకుని సుబ్బారెడ్డి(48) గుండెలో పొడిచి పారిపోయాడు. వెంటనే సుబ్బారెడ్డిని బద్వేలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ పర్యవేక్షించాలి

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో మెనూను, ఉపాధ్యాయులు పర్యవేక్షించాలనిఎంఈవో విలియం రాజు ఆదేశించారు. టీచర్లు పని వేళలు పాటించాలని ఓ ప్రకటనలో కోరారు.

ప్రమాదాలకు నిలయం.. రాయచోటి రింగు రోడ్డు..

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఔటర్ రింగు రోడ్డు అధ్వానంగా మారింది. తగు చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన వాహనదారుల్లో వ్యక్తమవుతోంది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో రాయచోటి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఈ రహదారిలో వందలాది సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. అలాంటి మార్గంలో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి.. వైసీపీ కార్యాలయం సమీపంలో, కనకదుర్గ ఆలయానికి వెళ్లే రహదారి జంక్షన్ వద్ద ఈ గుంతలు మరీ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ గుంతలకు ఈ మధ్యనే ఒకసారి ప్యాచ్ వర్క్ చేసినా కొన్ని రోజులకే మళ్లీ యథా పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడైతే పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. దీనిపై నేషనల్ హైవే అథారిటీ వారిని వివరణ కోరగా, ప్రస్తుతం ఆ రహదారిని పర్యవేక్షించే అధికారులు మారారని, వారి కాంటాక్ట్ నెంబర్ తమకు తెలియదని వివరించారు.



రాయచోటి రింగు రోడ్డుపై ఏర్పడిన గుంతలు, కోసుకుపోయిన సైడు బర్మ

సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొలాలను బీళ్లుగా వదిలేయకుండా సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జేడీఏ నాగేశ్వరరావు సూచించారు. బొగ్గుడివారిపల్లె రైతుసేవా కేంద్ర పరిధిలోని నేకనాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు ప్రధానమంత్రి సమ్మాన్‌నిధికి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారిని శైలజ, రైతుసేవా కేంద్రం సహాయకులు బి.సందీప్, గ్రామ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం

గాలివీడు: వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏవో మురళీధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని గోపనపల్లె, అరవీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో మనీషా, అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ్ ప్రకాశ్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

రైల్వేకోడూరు(రూరల్): భూసార పరీక్షల ఆధారం గా ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం మండలం లోని కె.సి. అగ్రహారం, బయనపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోం ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అరటి, బొప్పాయి, మామిడితో అధిక దిగు బడులకు పాటించాల్సిన చర్యలను వివరించారు. కూ రగాయలు, పూల పైర్ల సాగుకు ఉద్యానశాఖ రాయి తీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో పాటు, మా ర్కెటింగ్ చేసే సదుపాయం కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎం.భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ కొండారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న జేడీఏ ఎ.నాగేశ్వరరావు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సుండుపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రకాశ్ సూచించారు. మండల కేంద్రానికి సమీపంలోని జీకేరాచపల్లె ఎస్సీ వసతి గృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. భోజనం సక్రమంగా వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, మరుగు దొడ్లను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు హాజరుపై ఆరా తీశారు. హాస్టల్‌లో సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్‌డబ్ల్యూవో జయప్రకాశ్

చెరువు ముంపు ప్రాంతంలో సర్వే అడ్డగింత

వీరబల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లి ఎగువరాచపల్లె సమీపంలోని ముంపు భూములను రాజకీయ అండదండలున్న కొందరు పట్టా చేసుకోవడంపై పత్తిరాజుగారిపల్లె, పుల్లంరాజుగారిపల్లె గ్రామస్తులు నిరసన వ్యక్తం చేసి, సర్వే చేయడానికి వచ్చిన వీఆర్‌వో మహబూబ్‌బాషాను, సర్వేయర్ దామోదర్‌ను అడ్డుకున్నారు. చెరువు కింది భూములు ఎగువన ఉన్న తమకు దక్కుతాయి గానీ, ఇతరులకు ఎలా కట్టబెడతారంటూ వాగ్వాదానికి దిగారు. ఈ భూమి ఖాళీగా ఉంటే పశువులను మేపుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. తమకు తెలియకుండా చెరువు ముంపు ప్రాంతాన్ని పట్టా ఎలా చేయించుకుంటారని ప్రశ్నించారు. దీంతో అధికారులు వారి వాగ్మూలం తీసుకుని వెళ్లిపోయారు. కార్యక్రమంలో కే. రెడ్డెయ్యరాజు, కే. రెడ్డెమ్మ, కే. అచ్చిరాజు, కే. ఆంజనేయులు రాజు, ఆర్.వెంకట్రామరాజు, వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.


సర్వేను అడ్డుకుంటున్న గ్రామస్తులు

అన్నదానం పుణ్య కార్యక్రమం

సంబేపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో కన్నా అన్నదానం గొప్ప కార్యక్రమం అని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు పాటుకూరి వెంకట్రమణ కుమారుడు లీలాప్రేమ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మల్లవరం అడవికమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థు లకు మాంసాహార భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

జీసీడీవోగా ఆదర్శ పాఠశాల అధ్యాపకురాలు

సంబేపల్లె, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలు శెట్టిపల్లి శశికళ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిగా ఎంపిక అయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ మంగళవారం తెలియజేశారు. ఈ నెల 15న కలెక్టర్, డీఈవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆమె ఎంపిక కాగా, ఈ నెల 18న కలెక్టర్ నియామక పత్రం అందజేసినట్లు వివరించారు.

వర్షంతో రోడ్లు జలమయం

రైల్వేకోడూరు, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి) పట్టణంలో మంగళవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైల్వేస్టేషన్, సూర్యానగర్, న్యూ కృషానగర్, ఉంగరాలనగర్, మండల పరిషత్ ఆవరణలోని పలు రోడ్లు జలమయమయ్యాయి.రెడ్డివారిపల్లెకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తినడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. మళ్లీ వర్షం కురవడంతో రోడ్డు దెబ్బతిని వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులు ఆగిపోవడంతో వర్షం కురిసినప్పుడు తాత్కాలిక రోడ్డు లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


రెడ్డివారిపలె కు వెళ్లే రోడ్డు దుస్థితి

వరి పైరుపై పందుల దాడి

సుండుపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడదతో వరి రైతుకు తీరని నష్టం వాటిల్లింది. మండలంలోని పెద్దినేని కాల్వ గ్రామ పంచాయతీ బత్రాజుగారిపల్లికి చెందిన మహదేవరాజుకు చెందిన రెండు ఎకరాల వరి పొలంలో సోమవారం రాత్రి అడవి పందులు దాడి చేసి ధ్వం సం చేశాయి. చేతికందిన వరి పైరు ధ్వంసం కావడంతో ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

హెచ్ఐవీపై అవగాహన

రామాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై మంగళవారం రామాపురం మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ రమణారెడ్డి, లింక్ వర్కర్ సునీల్ మాట్లాడుతూ చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్ఐవీ కేవలం అరక్షిత లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, హెచ్ఐవీ ఉన్న మహిళ నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ వినియోగదారులకు 'ఇండేన్' సత్కారం

రాజంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇండేన్ గ్యాస్ స్థాపించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలోని ఒక్కో ఏజెన్సీ నుంచి 10 మంది సీనియర్ వినియోగదారులను సత్కరిస్తున్నట్లు ఆ సంస్థ రాజంపేట డిస్ట్రిబ్యూటర్ రాచూరి రాధాకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడును ఘనంగా సన్మానించారు. అనంతరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ వేలాదిమంది వినియోగదారుల్లో తనను ఎంపిక చేసినందుకు సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండేన్‌గ్యాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి రాయచోటిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

రాయచోటి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-17 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు, క్రీడా మైదానాన్ని సిద్ధం చేసే పనులకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భానుమూర్తి రాజు, అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డితో కలసి మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పాఠశాల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

తాగునీటి బోరు ప్రారంభం

చిన్నమండెం: మండలంలోని కాయలవాండ్లపల్లెలో మంగళవారం మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తాగునీటి బోరును ప్రారంభించారు. తాగునీటి ఎద్దడితో గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గ్రామంలో బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రికి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సెలూన్‌లపై దాడి కేసులో నిందితుల అరెస్ట్

రాయచోటి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని సెలూన్లపై ఈ నెల 20న రాళ్లతో దాడి చేసిన కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేసి , కోర్టులో హాజరు పరిచినట్లు రాయచోటి డీ ఎస్పీ కృష్ణమోహన్ తెలియ జేశా రు. పట్టణంలోని చెక్‌పోస్టు శివాలయం సమీపంలో ఉన్న రవి హెయిర్ కటింగ్ సె లూన్‌కు చెందిన రాచవీటి రవి కిశోర్, వె ంకటేశ్‌గారి రెడ్డిప్రసాద్, హసనా పురం తులసీ ప్రసన్నకుమార్‌లు చీప్ అండ్ బెస్ట్ హెయిర్ కటింగ్ సెలూన్, టోనీ అండ్ గాయ్ హెయిర్ కటింగ్ సెలూన్‌లపై రాళ్లతో దాడి చేసిన విషయం విదితమే. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరసింహారెడ్డి సిబ్బంది సోమవారం రాత్రి పట్టణ పరిధిలోని మంగల కాలనీలోని సత్యనారాయణ స్వామి గుడి వద్ద నిందితులను అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డా డు. రేణిగుంటకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముక్కావారి పల్లె పంచాయతీ అమృతవారిపల్లె వద్ద లారీ ఢీకొంది. స్థానికులు సమాచారం అం దించడంతో తీవ్రంగా గాయపడిన ఆయ నను ఆసుపత్రికి తరలించినట్లు 108 వా హన సిబ్బంది తేజ్‌కుమార్ తెలిపారు. గా యపడిన వ్యక్తికి చికిత్స అందించినట్లు వివరించారు. పూర్తి వివరాలు తెలియ రాలేదు

హజ్రత్ రంగీన్‌షావలి దర్గా కార్యవర్గం ఏర్పాటు



ఎస్‌కే హుస్సేని, రహీముద్దీన్

రాయచోటిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ బజారులో ఉన్న హజ్రత్ రంగీన్‌షావలి దర్గా కమిటీ అధ్య క్షుడిగా ఎస్‌ఏకే హుసేని, కార్యదర్శిగా రహీముద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సాధక్‌అలీ, హిమాయతుల్లా, కోశాధికారిగా ఎండీ అక్బర్, సంయుక్త కార్యదర్శులుగా పాలెం కిశోర్, ఇలియాస్‌బేగ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్‌రహీం, అలీముద్దీన్, నజీరుల్లా, సయ్యద్ అమీర్‌అలీ, ఎండీ అఫాన్, తమీమ్, అక్రముల్లా, మన్సూర్‌లను ఎన్ని కయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రతి శుక్ర వారం దర్గాకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

అర్చకులను నియమించండి

రామాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డెపల్లి, గంగనేరు క్వార్టర్స్‌లోని శ్రీరామాలయం, రాచపల్లి క్రాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులను నియమించాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూర్వం నుంచి ఈ ఆలయాలు ఉన్నాయని వారు తెలిపారు. అర్చకులను నియమిస్తే పూజా కార్యక్రమాలు సక్రమంగా జరుగుతాయని వివరించారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

గాలివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రీసర్వే కా రణంగా ఉత్పన్నమైన భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బాలాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని గుండ్లచెరువులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. విస్తీర్ణంలో వ్యత్యాసం, సహసంబంధ సవరణ, జాయింట్ ఫీల్డ్ విభజన, మ్యుటేషన్ సమస్యలు, పట్టాదారు పేరు నమోదు తదితర సమస్యలపై అర్జీలను స్వీకరించడంతో పాటు వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, సర్వేయర్లు, వీఆర్ఏ, వీఆర్‌వో, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

సిద్దవటం: మండలంలోని ఉప్పరపల్లె వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దారు మురాషావలి మాట్లాడుతూ మండలంలోని ఎస్.రాజంపేట, మందపల్లె, జంగాలపల్లె, శాఖరాజుపల్లెల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్వేయర్ ఇమ్మాన్యుయేల్, వీఆర్వో శివశంకర్, పంచాయతీ సెక్రటరీ సంధ్య రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సుండుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు, స్థానికులు డీపీవో బాలకృష్ణారెడ్డికి విన్నవించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో పారిశుధ్య సమస్యలు ఉన్నా ఐదేళ్లుగా పట్టించుకోలేదన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఈఓపీఆర్డీ సురేష్ బాబు, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మాలేపాటి శివరామ్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బాబుమోహన్ నాయుడు, బీసీ నాయకులు సురేష్, పంచా యతీ కార్యదర్శులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపద కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న డీపీవో బాలకృష్ణా రెడ్డి

అక్రమ నిర్మాణం నిలిపివేత

సుండుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భైరవగుట్టలో అక్రమనిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. రాయవారం ప్రధాన రహదారి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న గుట్టలో ఇప్పటికే మూడు ఇళ్లు నిర్మించారు. మరో ఇంటి నిర్మాణానికి పునాదులు తీశారని ఫిర్యాదు అందడంతో తహసీల్దారు దైవాధీనం... వీఆర్వో జయలక్ష్మి, రెవెన్యూ సిబ్బందిని పంపించి అక్రమ నిర్మాణం కోసం తీసిన గుంతలను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేశారు. మరోసారి గుట్టలో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


పునాది గోతులను పూడుస్తున్న ఎక్స్‌కవేటర్

విద్యార్థిని మృతి కేసులో నిందితుడిని ఉరి తీయాలి


గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేసి, దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, అక్టోబరు 22.(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని మృతి కేసులో నిందితుడిని ఉరి తీయాలని రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్మించారు. నిందితుడి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై అత్యా చారాలు, దాడులు అధికమయ్యాయన్నారు. నిందితుల వెనుక ఎంతటి వారున్నా పట్టించుకోకుండా చర్యలు తీసుకుంటే ఇటువంటివి జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి డిగ్రీ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

రాయచోటిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు టీ. ప్రభావతి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మాధవరం, గొర్లముదివేడు గ్రామాల్లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం శిశు సంక్షేమశాఖ అనుబంధంగా వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశాయన్నారు. లైంగిక వేధింపులు, గృహహింస, బాల్య వివాహాలు, వివాహేతర సంబంధాలు, బెదిరింపులు వంటి సమస్యలతో బాధపడుతున్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ తాత్కాలిక వసతితో పాటు, కౌన్సిలింగ్ ఇచ్చి న్యాయ, వైద్య, పోలీసు సహకారం ఉచితంగా అందిస్తుందన్నారు. మహిళల కోసం వారంలో 24 గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ నెంబర్ 181 ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది రెడ్డి ప్రసన్న, గ్రామ మహిళలు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు ప్రభావతి

తైక్వాండోలో ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు పతకాలు

పుల్లంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండో పోటీల్లో ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి తెలిపారు. రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపీసీ సెకండియర్ విద్యార్థిని భార్గవి, పదో తరగతి విద్యార్థిని లహరి సిల్వర్ మెడల్స్ సాధించగా పదో తరగతి విద్యార్థిని తేజస్విని 1 మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పీడీ నీలకంఠరావు, ఆర్ ఎస్ కోచ్ అధినేత రవిశంకర్‌రాజు, కోచ్‌లు మానస, గణేష్‌ను అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థినులతో పీడీ

పీడీఎస్‌యూ ఉత్సవాలు జయప్రదం చేయాలి

రాజంపేట, అక్టోబరు 22 : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగేశ్వర, కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, నాగేశ్వరబాబు, సుజాత పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టరుల విడుదల చేశారు సభ్యులు రామ్‌చరణ్, హేమంత్, శ్రావణి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

తోలుబొమ్మలాట


రావణుడితో వాదులాడుతున్న హనుమంతుడు



కనుమరుగవుతున్న ప్రాచీన కళలు
ఆదరణ కోల్పోతున్న కళాకారులు
ప్రత్యామ్నాయం వైపు అడుగులు
తొలి ప్రధాని మెచ్చిన ప్రాచీన కళ



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జానపద కళారూపం తోలుబొమ్మలాట భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. చర్మంతో తయారు చేసిన వివిధ బొమ్మలతో కథని తయారు చేసి జానపద కావ్యాలు, పురాణాల్లోని పాత్రలను సృష్టించుకుని తన భాషతో మూగచిత్రాలకు ప్రాణం పోశారు. చూపరులను అబ్బురపరిచేలా వాటిచేత రకరకాల విన్యాసాలు చేయించారు. తెరవెనుక ఉండి పాత్రలను కదిలిస్తూ జీవంలేని బొమ్మలతో జీవనిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడంలో జానపదుడి కళాత్మకం దాగివుంది. క్రీస్తుపూర్వం 3వ శతాబ్ధంలో తోలుబొమ్మలాటలు ఎక్కువగా ప్రదర్శించబడేవి. అప్పటి జనుల వేడుకలో తోలుబొమ్మలాట ఒకటి. ప్రాచీన కాలంలో తోలుబొమ్మలాటకు మంచి ప్రాధాన్యత, కళాకారులకు ప్రోత్సాహం, ఆదరణ ఉండేది. అప్పట్లో తోలుబొమ్మలాట బహుళ ప్రజాదరణ పొందింది. విజయనగర రాజుల కాలంలో కాలుడు అనే గొప్ప తోలుబొమ్మలాట కళాకారుడు ఉండేవాడని, ఆటలో అందె వేసిన వారని పెద్దలు చెబుతుండేవారు. ఆయన నైపుణ్యాన్ని చూసిన ఓ కవి తన కవిత్వాన్ని అతనికి అంకితం ఇచ్చాడంటే అప్పటి కాలంలో తోలుబొమ్మలాటకు ఆదరణ ఎంత ఉండేదో ఇట్టే అర్థమవుతోంది. తోలుబొమ్మలు ప్రదర్శించడంలో అనేక కొత్త పద్ధతులు కనిపెట్టి ప్రజల మన్ననలు పొందేవారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళపట్ల ఆసక్తి కనబరచడంతో రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో అప్పటి కళాకారులు ఢిల్లీకి వెళ్లి ప్రధాని ఎదుట ప్రదర్శనలు ఇచ్చారుట. తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎడ్లబండ్లలో వెళ్లి వీక్షించేవారు. టీవీలు, సినిమాలు వచ్చిన తరువాత వాటి ప్రాధాన్యత తగ్గడమే కాక ప్రాచీన కళలు కనుమరుగై పోతున్నాయి. కదిలే తోలుబొమ్మల ప్రదర్శన గురించి తెలుసుకోవాలంటే తాతయ్య, అమ్మమ్మను అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి.



కడప జిల్లాలో సుమారు 50 ఏళ్లకు ముందు కలసపాడు మండలం శింగరాయపల్లె నుంచి 40 కుటుంబాలకు పైగా పోరుమామిళ్ల ప్రాంతానికి వలస వచ్చి నివాసం ఉంటూ ప్రదర్శనలు ఇస్తుండేవారు. ఎక్కువగా భారతం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవ వధ, కర్ణపర్వం, ధృవపర్వంలాంటి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఎక్కువగా కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రతి ప్రదర్శనలో ఉండేలా వీరు నాటకాన్ని తీర్చిదిద్దేవారు. కేతిగాడి చిలిపి చేష్టలు, వారి మాటలకు జనాలు ఆనందంగా నవ్వుకునేవారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన తోలుబొమ్మలాట దేశ విదేశాల్లో సైతం ప్రజాదరణ పొందిందనడంలో అతిశయోక్తి లేదు. ఆ కళాకారులకు విదేశీయులతో సత్సంబంధాలుండడంతో విదేశాల్లో కూడా ఈ కళాకారులు వెళుతుండేవారు. ప్రాచీన ఓడరేవులైన భీమునిపట్నం నుంచి వ్యాపార నిమిత్తం భారతీయ వర్తకులు విదేశాలకు వెళుతుండేవారు. వీరితో కలిసి బొమ్మలాట కళాకారుల బృందాలు కూడా వెళ్లేవి. ఇలా విదేశాల్లో తోలుబొమ్మలాట ప్రచారానికి వచ్చిందని తెలుస్తోంది. 17వ శతాబ్ధం నాటి పారిస్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో ఈ ఆటకు ఆదరణ దక్కింది.

తోలుబొమ్మల తయారీ...

చర్మాలను నిలువునా సాగదీసి వాటిని ఎండబెట్టి భద్రపరిచి బొమ్మల అవయవాలు కదిలేలా భాగాలు కత్తిరించి కదిలేందుకు అనువుగా అమర్చుతారు. దీంతో ప్రజలు చక్కని వినోదం పొందేవారు. తోలుతో బొమ్మలు చేసి ఆడించడంతో తోలుబొమ్మలాటగా పేరు వచ్చింది. సంస్కృతంలో ఛాయానాటకంగా పిలుస్తారు. బొమ్మలాట తెరకు వెలుతురు కనబడని ముతక వస్త్రాన్ని ప్రత్యేకంగా ఉపయోగించేవారు. దాదాపు 24 అడుగులు తెర వెనుక 12 అడుగుల ఖాళీస్థలంలో వాయిద్య కళాకారులు పాటలు పాడేవారు. ప్రదర్శన కోసం అప్పట్లో ఆముదపు దీపాలు, కాగడాలు ఉపయోగించేవారు. కాలక్రమేణా ఎరుపు ట్యూబులైట్లతో బొమ్మలను ఆడించేవారు. బొమ్మకు కొక్కేలు ఏర్పాటు చేసి కళాత్మకంగా బొమ్మలను ఆడిస్తూ వినోదం అందించేవారు.

తగ్గిన ఆదరణ

తోలుబొమ్మలాటకు రానురాను ఆదరణ తగ్గింది. అప్పుడప్పుడూ టీవీల్లో ఆదివారం ప్రత్యేకించి ఈ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇప్పుడు చూడాలంటే ఏ తెలుగు మహాసభల కోసమో, సాంస్కృతిక చిహ్నంగా ప్రదర్శిస్తుంటారు. ప్రస్తుతం కాలగర్భంలో కలిసిన గ్రామీణ కళల జాబితాలో చేరుతోంది. తోలుబొమ్మలాట కళాకోవిదుల బతుకుదెరువుపై గీతాలాపనే ఇప్పుడిక మిగిలింది. మహోన్నత చరిత్ర కలిగి దేశ విదేశాల్లో ఆహ్లాదం, వినోదం అందించిన తోలుబొమ్మలాటలు నేడు పూర్తిగా కనుమరుగయ్యాయి. వాటిని నమ్ముకున్న కళాకారులు వీధిన పడ్డారు. సరైన ఆదరణ లేకపోవడంతో తోలుబొమ్మలు ఆడించి పొట్ట పోసుకుని జీవనం సాగించే కళాకారులు వీధినాటకం ఆడే భాగవతులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడ్డ సమాజం గతంలో తోలుబొమ్మలాట ఉందనే విషయం కూడా మరిచారు. రాజులను సైతం మైమరిపించిన ఈ ఆటను తిరిగి తెరపైకి తెచ్చేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదనడంతో సందేహంలేదు.

ప్రభుత్వ పథకాల్లో ప్రచారం...

ప్రభుత్వ పథకాల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం ఇచ్చారు. కళనే నమ్ముకున్న కొందరు కళపై మక్కువను వదులుకోక తిరుణాళ్ల, జాతర వంటి క్షేత్రాల్లో గ్రామస్తుల కోరిక మేరకు ప్రదర్శనలు ఇస్తున్నారు. మహా భారతం, రామాయణం, ప్రమీలార్జునీయం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవవధ, కర్ణపర్వం, ధృవ పర్వం ప్రదర్శనలు ఇచ్చేవారు. కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రదర్శనలో కీలకంగా ఉండేవారు. ముఖ్యమంత్రి ద్వారా అవార్డులు కూడా అందుకున్నారు.

తొలి ప్రధాని మెచ్చిన కళ

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళ గురించి విని ఆసక్తి కనబరచడంతో అప్పటి కళాకారులు ఢిల్లీలో ప్రదర్శనలు ఇచ్చారు. రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో వెంకట్రావు, సుబ్బారావు, గోవిందరావు. రామోజీరావు, క్రిష్టారావు, ఎరికలమ్మ, జానకమ్మ బృందం ఢిల్లీలోని సర్వదేవాపురం వద్ద పద్మ యాగం, సైంధవవధ బొమ్మలాట ప్రదర్శించారని అప్పటి కళాకారులు చెబుతున్నారు. ఈ కళకు ఉన్న ఆదరణ గురించి తోలుబొమ్మలాట కళాకారిణి జానకమ్మ ఓ పత్రికలో తన జ్ఞాపకాలను నెమరువేసుకుందని వనపర్తి పెద్దమునిరావు తెలిపారు. ఆమెకు చదువు రాక పోయినా రామాయణం, భాగవతఘట్టాలు ఆకట్టుకునేలా కథనం చెప్పేవారు. ప్రధాని నెహ్రూ కళాకారుల ప్రదర్శనలు వారం రోజులు వీక్షించి వారిని ఆదరించారని ఇప్పటి కళాకారులు తెలిపారు.

50 ఏళ్లుగా ఈ వృత్తిలోనే..



50 ఏళ్లగా తోలుబొమ్మలాటనే నమ్ముకుని ఉన్నాం. తోలుబొమ్మలాట ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చే వారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానం అందితే గ్రూపు సభ్యులు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చి, వారిచ్చే కానుకలను స్వీకరించే వారం. జన్మభూమి, కడప వారోత్సవాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను ఎంతో ప్రోత్సహించే వారు. ఇప్పటికైనా కళాకారులను ఆదరించి ప్రాచీన కళలకు ప్రాణం పోసేలా చర్యలు తీసుకోవాలి.

- వనపర్తి పెద్దమునిరావు, ఎస్టీకాలనీ, రంగసముద్రం, పోరుమామిళ్ల

కళాకారులకు తగ్గిన ఆదరణ



తోలుబొమ్మలాట కళాకారులకు నేడు ఆదరణ లేదు. తమ కళలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వయోభారంతో పని చేయలేక తరతరాలుగా వస్తున్న వృత్తిని వదలుకోలేక కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం కార్యక్రమానికి వెళితే గ్రూపునకు రూ.15వేలు ఇస్తున్నారు. ఆ డబ్బుతోనే జీవిస్తున్నాం. కళాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది.

- నరసింహులు, ఎస్టీకాలనీ, పోరుమామిళ్ల



అప్పటి సీఎం చంద్రబాబు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న పెద్ద మునిరావు (ఫైల్)





తోలుబొమ్మలాట కళాకారుల ర్యాలీ - తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వద్ద తోలుబొమ్మలాట ప్రదర్శించిన జానకమ్మ (ఫైల్)

మహిళామణుల సారధ్యంలో...

నేడు జడ్పీ సమావేశం

(5వ పేజీ తరువాయి)

ఎంతమేర చర్చజరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రజలు మాత్రం జిల్లాలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

శాఖల వారీగా పరిశీలిస్తే...

- 2024 ఖరీఫ్ పంటలకు కష్టకాలం దాపురించింది. నైరుతి రుతుపవనాలు అసమతుల్య వర్షాలను కురిపించడంతో వర్షాధారం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 299.5 మి.మీ మాత్రమే నమోదవడంతో చాలా వరకు పంటలు ఎండిపోయాయి. ఇప్పటికే వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు పశువులకు వదిలేశారు. 2024 ఖరీఫ్‌లో 75,189 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా 51,518 హెక్టార్లు మాత్రమే సాగుకు నోచుకున్నాయి. ఇందులో వర్షాభావ పరిస్థితుల కారణంగా 8,700 ఎకరాలు, అతివృష్టి వర్షాల కారణంగా 2,241 ఎకరాల్లో పంటలు దెబ్బతిని రూ.కోట్లలో పంట నష్టం వాటిల్లడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన నష్టపరిహారం, పంటల బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీలు జిల్లా రైతులకు సక్రమంగా అందడంలేదు. వీటిపై ప్రధానచర్చ జరగాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలోని బాల, బాలికల వసతిగృహాల నిర్వహణకు మంజూరైన నిధులు ఖర్చు చేస్తున్నా 60శాతం వసతి గృహాల్లో తాగునీరు ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. బీసీ సంక్షేమం ద్వారా బీసీ, ఈబీసీ విద్యార్థులకు గతేడాదికి సంబంధించిన పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్పులు చాలా మందికి విడుదల కావాల్సి ఉంది. మైనార్టీ సంక్షేమం కింద ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన ఐసీడీఎస్ అధికారులు దాన్ని పూర్తిగా మరిచిపోయారనే ఆరోపణలున్నాయి. వీటిపై చర్చ జరగాల్సి ఉంది.
- జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్ స్కీంల పనితీరు లోపభూయిష్టంగా మారింది. వీటికి సంబంధించి ఇటీవల జరిగిన టెండర్లు నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టానుసారం చేపట్టారనే ఆరోపణలున్నాయి. వర్షాలు కురుస్తున్నా జిల్లాలో చాలా చోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కడప నగరంలో ఐదురోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో వాటర్‌స్కీంపై సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ నీటివనరుల నిర్మాణాలున్నాయి. ఇందులో 1,841 చిన్ననీటిపారుదల వనరుల ద్వారా 1,11,225 ఎకరాల ఆయకట్టు, 4 మధ్యతరహా నీటిపారుదల వనరుల ద్వారా 59,955 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ అయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. రూ.18 కోట్ల జైకా నిధులతో చేపడుతున్న బుగ్గవంక ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు ఏళ్లతరబడి నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపైనా, కేసీకెనాల్, పులివెందుల బ్రాంచ్‌కెనాల్, తెలుగుగంగకు నీటి కేటాయింపులపైనా చర్చసాగాల్సి ఉంది.

మొరవ పోతున్న బాలంవారిపల్లె ప్రాజెక్టు

- అప్రమత్తమైన పోలీసులు, రెవెన్యూ అధికారులు



పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు గార్గేయ నదిలో ప్రవాహం పెరిగి నీరు బాలంవారిపల్లె ప్రాజెక్టులోకి అధిక మోతాదులో చేరుతోంది. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె ప్రాంతంలో రెండు చెరువులకు గండ్లు పడడంతో నీటి ప్రవాహం పెరిగింది. ఆ నీరంతా ప్రాజెక్టులోకి చేరి నిండడంతో మంగళవారం సాయంత్రం మొరవ పోయింది. ఆ నీరంతా ప్రాజెక్టు దిగువన ఉన్న పింఛా నదిలో చేరడంతో పీలేరు మండలం బాలంవారిపల్లె వద్ద నది ప్రవాహం పెరిగింది. దీంతో పీలేరు మండల పోలీసు, అధికారులు అప్రమత్తమయ్యారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని మహిళలు, పశువుల కాపరులు నది వైపు వెళ్లవద్దని వారు హెచ్చరికలు జారీ చేశారు. బాలంవారిపల్లె ప్రాజెక్టుతోపాటు బాలంవారిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె వద్దనున్న బ్రిడ్జీని పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రాత్రి పూట ఎవరూ నదిని దాటేందుకు ప్రయత్నించకూడదని పరిసర గ్రామాల్లో చాటింపు వేశారు.

ఆకతాయిలనుంచి బైక్‌లు స్వాధీనం

- తల్లితండ్రులు సహా యువతకు సీఐ కౌన్సెలింగ్



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజారెడ్డి

బి.కొత్తకోట. అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాలేజీల పరిసరాల్లో అడ్డదిడ్డంగా బైక్‌లు నడుపుతూ అమ్మాయిలను టీజింగ్ చేయడం, ట్రిబుల్‌రైడింగ్‌తో బైపాస్‌రోడ్డులో స్టంట్‌లు చేసే ఆకతాయి యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి బైక్‌లను సైతం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకుల తల్లితండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వడం నేరమని, తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, వాహనం ఎలా నడుపుతున్నారు, అని గమనించాల్సిన బాధ్యత తల్లితండ్రులపై వుండాలని సీఐ రాజారెడ్డి హితవు పలికారు. కాలేజిలు వదిలిన సమయంలో కొందరు యువకులు ఆ ప్రాంతంలో అభ్యంతరకరమైన పనులు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న శివయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో టైలర్ శివయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని పీటీఎం రోడ్డులో కాపురం వుంటున్న శివయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి పొద్దు పోయాక మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబీకులు శివయ్యను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సలహా మేరకు ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందడంతో ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దౌర్జన్యం కేసులో ఇద్దరికి జరిమానా

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళపై దౌర్జన్యం చేసిన ఇద్దరికి పీలేరులోని స్పెషల్ కోర్టు న్యాయాధికారి జరిమానా విధించినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు కేవీపల్లె మండలం మద్దిపట్లవారిపల్లె పంచాయతీ అంగజా లవారిపల్లె వాసి వి.జయరామయ్య, చెన్నారెడ్డి కాలనీ వాసి ఇరగంరెడ్డి చెన్నారెడ్డి పద్మావతి నగర్ వాసి కొత్తపల్లె రత్నమ్మపై దౌర్జన్యం చేశాడు. ఆమె ఇంట్లోని రూ.40 వేలు విలువైన గృహోపకరణాలు ధ్వంసం చేశాడు. రత్నమ్మ ఫిర్యాదుతో అప్పటి ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేశారన్నారు. కేసు పీలేరులోని స్పెషల్ కోర్టులో విచారణ జరిగిందని, వారిపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి మురళీ వారిద్దరికీ చెరో రూ.6 వేలు జరిమానా విధించారన్నారు. లేని పక్షంలో ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష విధించారని సీఐ వివరించారు.

సప్లై చానెల్‌కు మరమ్మతులు

పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై చానెల్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సదుం, సోమల మండలాల్లో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో మండలాల్లోని చెరువులు తెగడం, ఆ నీరంతా గార్గేయ నది ద్వారా బాలంవారిపల్లె ప్రాజెక్టులో చేరుతుండడంతో ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారు. బాలంవారిపల్లె ప్రాజెక్టు నిండి మొరవపోతే ఆ నీరు పింఛానది ద్వారా కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్‌కు మళ్లించుకోవచ్చు. పింఛా నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు దారితీసే సప్లై చానెల్‌లో పొదలు, చెట్లు బాగా పెరగడంతో వాటిని తొలగిస్తూ చానెల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఈఈ గురుమోహన్ ఆదేశించారు.

ప్రతి పని వందశాతం గ్రౌండింగ్ కావాలి

- సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పశువుల షెడ్లు, పనులు త్వరితగతిన చేపట్టాలి
- పల్లె పండుగ వారోత్సవాల్లో కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ వారోత్సవాల్లో మంజూరైన ప్రతి పనిని యుద్ధ ప్రాతిపదికగా వందశాతం గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీఓలు, పీఆర్ ఇంజనీర్లు, ఉపాధి హామీ ఏపీఓలు, పంచా యతీ సెక్రటరీలు తదితరులతో నిర్వహిం చిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించి గ్రామాలకు అవసరమైన రహదారులు, కాల్వలు, విద్యుత్, పశువుల షెడ్స్ తదితర మౌలిక వసతులు, ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పనతో గ్రామాల్లో స్థిరమైన ఆస్తులు ఏర్పరచాలని సంకల్పించిది. తద్వారా గ్రామాలన్నీ నూతన శోభను సంతరించుకోనున్నాయి. ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో జిల్లా మంత్రి వర్యులు, ప్రజాప్రతినిధులు పండుగలాగా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వారోత్సవాల్లో భాగంగా 722 అంతర్గత సీసీ రోడ్లకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఆయా మండలాలకు మంజూరు చేసినవి, భూమి పూజ, పని మొదలైనవి, ప్రారంభం కానివి తదితర వివరా లు, కారణాలు ఆయా ఎంపీడీఓల ను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో వెంటనే పనులు మొదలు పెట్టాలని, డిసెంబరు 31లోగా అన్ని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది వల్ల మంజూరైన పనిని రద్దు చేయాల్సి వస్తే ఆ పని విలువకు తగిన విధంగా మరోచోట పనిని మొదలు పెట్టాల ని సూచించారు. పనులు చేపట్టడానికి అవసరమైన ఇసుకను స్థానిక వాగులు, వంకలు ఎక్కడ లభ్యత ఉంటే అక్కడి నుంచి ప్రభుత్వ అనుమతించిన రీచుల నుంచి తీసుకెళ్లవచ్చన్నారు. లేబర్ బడ్జెట్ జనరేషన్‌లో కేవీపల్లి, మదనపల్లె, నిమ్మపల్లె, వాయల్పాడు వెనుకబడి ఉన్నాయని, ఆయ మండలాల్లో ప్రగతిలోకి తీసుకురావలని సూచించారు.

బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



కురబలకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తెట్టు పంచాయతీ పూజారివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ, దశరథ తన వాహనంలో అంగళ్లుకు పొంతపనుల నిమిత్తం వచ్చారు. కాగా బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు వెళ్ళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటరమణ పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దమండ్యం, అకోటబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం పెద్దమండ్యం, ఎన్‌ఓ పల్లి, కలిచెర్లలో పక్కా గృహాల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. దశల వారిగా మండలంలో జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్‌లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ ఏఈ అక్రమ్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రామసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనాధ శవానికి గ్రామస్తులు అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. దినసరి మార్కెట్ షెల్టర్‌లో కొంతకాలంగా ఓ వృద్ధ అనాద ఉండేవాడు. ఇతనికి అక్కడి వ్యాపారులు రోజూ భోజనం పెట్టేవారు. కాగా సోమవారం రాత్రి ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. పంచాయతీ సెక్రటరీ నాయక్ గ్రామస్తులు కలిసి అంత్యక్రియలు జరిపించారు.

మీడియా అవార్డు-2024కు ఎంట్రీలు ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ఓటర్లలో చైతన్యం, అవగాహన ప్రచారంలో ఉత్తమ కృషి చేసిన మీడియాకు అవార్డులను ప్రధానం చేసేందుకు వివిధ మీడియా సంస్థల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోందని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా (టెలి విజన్, రేడియో), ఆన్‌లైన్ (ఇంటర్నెట్, సోషల్) రంగాల్లో ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంపొందించేందుకు కృషి చేసిన వారికి రంగానికి ఒక అవార్డు వంతు భారత ఎన్నికల సంఘం 2021 నుంచి ఏటా అవార్డులు అందిస్తోందన్నారు. 2024 ఏడాదికి సంబంధించి 2025 జనవరి 25వ తేదీ జాతీయ ఓటరు దినోత్సవం రోజున ఈ అవార్డులను ప్రధానం చేయనుందన్నారు. అవార్డు కింద ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించనున్నారని సీఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెళకువలను పాటించాలని వ్యవసాయ ఏడీఏ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం పోతబోలులో పొలం పిలుస్తోంది లో భాగంగా రైతులకు పలు పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఎక్కువగా ఎరువులను వాడడం వలన భూమి రొట్టలు పడుతుందన్నారు. ఏఓ నాగప్రసాద్,ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ నవ్యజ్యోత్స్న, వెంకటేశ్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

అతి కష్టంగా ఆరు కిలోమీటర్లు



బెంగళూరు బస్టాండ్‌లో నడిరోడ్డుపై గుంతలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు22: (ఆంధ్రనజ్యోతి) మదనపల్లె పట్టణం నడుబొడ్డు నుంచి నాలుగువైపులా ఆ ఆరు కిలోమీటర్లు ప్రయాణం అతికష్టమౌతోంది. పట్టణం నుంచి పుంగూరు రోడ్డు జాతీయ రహదారి వరకు, పట్టణం నుంచి వేంపల్లె క్రాస్ రోడ్డు వరకు. సీటీఎం రోడ్డు నుంచి తట్టివారిపల్లె బైపాస్ వరకు. చిత్తూరు బస్టాండ్ నుంచి పెంచుపాడు రోడ్డు లాభాల గంగమ్మ ఆలయం వరకు ఉన్న తారు రోడ్లు పాడైపోయాయి. రోడ్డుపై కొన్ని చోట్ల చెరువులను తలపించేలా గుంతలు పడ్డాయి. దీంతో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకులు వళ్లు హూనం చేసుకుని ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా మరిపోయాయి. బెంగళూరు బస్టాండ్ ఇందిరమ్మ కూడలిలో పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరుకూడా అక్కడే నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. బెంగళూరు రోడ్డులోని దర్గా వద్ద, పప్పిరెడ్డిగారిపల్లె వద్ద, చిప్పిలి మిల్క్‌డైరీ వద్ద, చిప్పిలిలో, వేంపల్లె క్రాస్ వరకు రోడ్డు మొత్తం గుంతలే కనిపిస్తాయి. చిత్తూరు బస్టాండ్ నుంచి బాకావానితోపులో రోడ్డు పూర్తిగా గుంతలమైయమైంది. చిత్తూరు బస్టాండ్ నుంచి పుంగనూరు రోడ్డులో మిషన్ కాంపౌండ్ ముందర, ఎంఎల్‌ఎల్ ఆస్పత్రి వద్ద, నిమ్మనపల్లె క్రాస్, నెమలి కల్యాణమండపం, బోర్డు, అంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు పాడైపోయింది. ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలనంటే నరకయాతన తప్పదు మరి.

బడి భోజనం.. ప్రక్షాళన



- పథకంలో మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- ఎస్‌ఎంసీ సూచనలు పరిగణనలోకి...

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో విద్యార్థులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అసలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. రుచితో పాటు ఇష్టపడని కూరల కారణంగానే విద్యార్థులు బడి భోజనంపై అయిష్టత చూపుతున్నట్లు ఎప్పటి నుంచో ఉంది. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా బడిలోనే భోజనం చేసేలా కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడి నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులకు సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్థమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1748 , ఉన్నత, హైస్కూలు ప్లస్ పాఠశాలలు 306 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ వరకు 1.47 లక్షలు మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాల గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల సమీక్ష నిర్వహించింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు .. భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ (ఎస్‌ఎంసీ) నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేయగా అందులో మేలైన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్న భోజనం పథకంలో మార్పులు చేసేందుకు సిద్ధమైంది.

కమిటీ సూచనలు ఇలా...

- మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలి
- పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారి మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలి కూడా చాలా మంది విద్యార్థులు తినడం లేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండడం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు, లేదా పాలు ఇవ్వాలి.
- కడప కార్పొరేషన్ పరిధిలో ఇస్కాన్ సంస్థ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తుంది. ఈ సరఫరాలో భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడంలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా అరటిపండు ఇస్తున్నారు. దీనిపై కూడా ఇంకా మెరుగైనది ఇస్తే బాగుంటుంది.
- ఏజన్సీలకు ఏ నెలకు ఆ నెల బిల్లులు చెల్లించడం లేదు. అప్పు లు చేయాల్సి వస్తోంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజన్సీలకు అప్పులబాధ తప్పుతుంది.

అయితే... నాకేంటి?

- విద్యుత్ శాఖలో ఓ ఉద్యోగి లంచావతారం
- పనుల కోసం వెళ్లే ప్రజలకు తప్పని పాట్లు
- సమస్యలు పరిష్కారం కాక రైతన్నలూ సతమతం

విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అవినీతి దాహం తారాస్థాయికి చేరింది. విద్యుత్ సంబంధిత పనులు, సమస్యలపై ఎవరైనా ఆయనను ఆశ్రయిస్తే.. 'అయితే నాకేంటి ' అంటూ రాజేంద్రప్రసాద్ అహనా పెళ్లంట సినిమాలో సిగ్గులేకుండా లంచం డిమాండ్ చేసినట్లు చేస్తున్నాడు. చేయి తడపందే పని జరుగదని నిర్మొహమాటంగా చెబుతున్నాడు. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఈ ఉద్యోగి నిర్వాకంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.





తెగిపోయి పొలాల్లో పడిన విద్యుత్తు వైరు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గృహ అవసరాలకు, వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్తు పనుల కోసం వెళ్లే ప్రజలను ఆమ్యామ్యాలు సమర్పించాల్సిందేనని కరాఖండిగా చెబుతున్నాడు. దీంతోవిసిగి వేసారిన ప్రజలు తిరుపతిలోని విద్యుత్తుశాఖ టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అయితే ఆ శాఖకు సంబంధించిన యూనియన్‌ను అడ్డం పెట్టుకుని సదరు ఉద్యోగి సమస్యల నుంచి సులువుగా గట్టెక్కుతున్నాడు. మండల విద్యుత్తు శాఖలోని సిబ్బందిలో నెలకొన్న అంతర్గత కలహాలు ప్రజలకు శాపంగా మారాయి. ఇటీవల దువ్వూరు పొలాల్లోని కుమ్మరోనిమల్లు, గాజులోళ్లబావి సమీపంలో విద్యుత్తు వైర్లు తెగి కిందపడ్డాయి. ఈ సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లేకపోవడంతో వీరు ఆందోళనకు గురవుతున్నారు. వైర్లు తెగిపోవడంతో దువ్వూరు పొలాల్లోని 20 దాకా వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయి అయిదు రోజులుదాకా గడిచింది. దీంతో బోర్ల కింద పొలాల్లో వేసిన జొన్న, వరి, అనప, వేరుశనగ, అరటి, పసుపు లాంటి పంటలు నీటి తడులు అందక సంబంధిత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే కాలయాపన చేస్తే పంటలు ఎండిపోతాయని సంబంధిత రైతులు అధికారులపై ఆక్రోశం వెలుబుచ్చుతున్నారు. పంటల సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు కింద వెచ్చించామని ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులు వాస్తవమే..

తమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. శాఖాపరంగా పై అధికారుల నిర్ణయాల మేరకు నడుచుకుంటాం.

-బి.వీరారెడ్డి, విద్యుత్తు శాఖఏఈ, దువ్వూరు

చెరువులో పడి వ్యక్తి మృతి



నిరసింహుడు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం సమీపంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి వనిపెంట నరసింహుడు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం నుంచి ఇతను కనిపించకపోవడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. చెరువు వద్ద చెప్పులు, ఇతర వస్తువులు కనిపించడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం చెరువులో ఇతని శవాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్యపై భర్త కత్తితో దాడి



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగ సముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్‌కాలనీలో వనపర్తి అంజలి అనే మహిళపై ఆమె భర్త నారాయణ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ మూర్తి వివరాల మేరకు.. వనపర్తి నారాయణకు అంజలితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. నారాయణ మద్యానికి బానిసై... అనుమానం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో భార్యపై మచ్చుకత్తితో దాడి చేయడంతో తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ తమిళ కూలీలు, దుంగలతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముడుంపాడు బీటు మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా 9 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా బేస్ క్యాంపు సిబ్బంది దాడులు నిర్వహించి తమిళనాడుకు చెందిన ఇద్దరు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యత అని.. కొత్త వ్యక్తులు ఎవరైనా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో రమేష్‌బాబు, ముడుంపాడు బీట్ ఎస్బీవో అంజనాస్వాతి, గౌసియా, రమణ, శంకర్, రామయ్య, శేషు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ తెలపండి



కంచపు లోకేశ్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికమ్మపల్లికు చెందిన కంచపు లోకేశ్ (14) అనే బాలుడు అదృశ్యమయ్యాడని.. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అడవికమ్మపల్లి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లోకేశ్ ఈనెల 21వ తేదీ స్కూల్‌లో ఐడీ కార్డు తీసుకోవాలని తన తండ్రి వద్ద రూ.500 డబ్బులు తీసుకొని వెళ్లినట్లు తెలియజేశారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలుడు తండ్రి రామయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు సబేపల్లె పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలుడు గురించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే.. 9121100566, 7981200671 సెల్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

మున్సిపాలిటీకి శాపంగా... వైసీపీ అసమర్థపాలన

- సుందరీకరణ పేరుతో వందల కోట్లు వృథా
- పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు
- చేసిన పనులను మళ్లీ చేసిన గత ప్రభుత్వం
- విద్యుద్దీపాల సమస్య పరిష్కరించకుంటే ధర్నా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అసమర్థపాలనతో పులివెందుల మున్సిపాలిటీకి శాపంగా మారిందని, సుందరీకరణ పేరుతో వందలకోట్ల రూపాయలు వెచ్చించినా ఫలితం లభించలేదని పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టారని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్‌డీఏ కూటమి నాయకులు బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిలతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి తరలివెళ్లి మున్సిపల్ సమస్యలపై కమిషనర్, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపాలిటీల్లో విద్యుత్ దీపాలను ఆర్పి వేసి పట్టణాన్ని అంధకారంలోకి నెట్టడానికి కారణాలను అడిగారు. వారంలోగా విద్యుత్ దీపాల సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మీడియా సమావేశంలో రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 4800 విద్యుత్ దీపాలు ఉంటే.. పదిశాతం కూడా ప్రస్తుతం వెలగడం లేదన్నారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల పులివెందులలో దొంగతనాలు ఎక్కువయ్యాయన్నారు. పాలకమండలి చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వాస్తవాలు దాచిపెట్టి విద్యుత్‌దీపాలను వెలగనీయకుండా చేయడం, రెండు మూడు రోజులకు ఒకసారి మంచినీటిని విడుదల చేస్తున్నారన్నారు. ఇక 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి 2024 వరకు దఫదఫాలుగా చేసిన రింగురోడ్డు సుందరీకరణ పనులను మళ్లీ మళ్లీ చేసుకుంటూ నిధులు వృథా చేశారన్నారు. ఇప్పటికి మున్సిపల్ పరిధిలో 150 వీధుల్లో అండర్ డ్రైనేజీ, సిమెంటు రోడ్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఆశలతో అధికారం ఇస్తే సొంత నియోజకవర్గానికి జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. పులివెందుల ప్రజలకు ఏ వార్డుకు ఎవరు కౌన్సిలరో కూడా తెలియని పరిస్థితి ఉండడం చూస్తే గత ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వారంలోగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌దీపాల సమస్యను పరిష్కరించకపోతే ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దానా తుఫాను కారణంగా పలు రైళ్లు రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్టు రైల్వే డివి జన్ పరిధిలో దానా తుఫాను కారణంగా 23, 24 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ కామాఖ్య - ఎస్‌ఎంబీటి బెంగళూరు, సిల్‌చార్ - సికింద్రాబాద్, డిబ్రూగర్ - కన్యాకుమారి, సికింద్రబాద్ - భువనేశ్వర్, చెన్నై సెంట్రల్ - హౌరా, పుదుచ్చేరి - హౌరా, చెన్నై - షాలిమార్, పుదుచ్చేరి - భువనేశ్వర్, కెఎస్‌ఆర్ బెంగళూరు - భువనేశ్వర్, సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్, ఎస్‌ఎంబీటి బెంగళూరు - గౌహతి, హైదరాబాద్ - హౌరా, కన్యాకుమారి - డిబ్రూగర్, సికింద్రాబాద్ - హౌరా, ఎస్‌ఎంబీటి బెంగళూరు - హౌరా, సికింద్రాబాద్ - మాల్దా టౌన్, యశ్వంతపూర్ - హౌరా, తిరున్వేలి - షాలిమార్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 24వ తేదీన పూరీ - తిరుపతి, హౌరా - సికింద్రాబాద్, ఖర్గపూర్ - విల్లుపురం, హౌరా - భువనేశ్వర్, షాలిమార్ - చెన్నై సెంటర్, సత్రాగచ్చి - మంగళూరు సెంటర్, హౌరా - తిరుచురాపల్లి, హౌరా - ఎస్‌ఎంబీటి బెంగళూరు, షాలిమార్ - వాస్కోడగామ, హౌరా - చెన్నై సెంట్రల్, పాట్నా - ఎర్నాకులం, సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ రైళ్లను రద్దు చేశారు.

గండికోట నుంచి 3150 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైల వరానికి మంగళవారం 3150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 3000 క్యూసెక్కులు, వరద నీరు మరో 150 క్యూసెక్కులు వచ్చి చేరినట్లు డీఈ తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చే నీటిని యధా తథంగా మైలవరం జలాశయానికి వదులుతున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టి... అటవీ సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళశారం జిల్లా అటవీ కార్యాలయంలో ఉప అటవీ అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫారెస్టు ప్రొటెక్షన్ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

రసవత్తరంగా... ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలు

- స్వల్ప స్కోర్‌కే కుప్ప కూలిన వెస్ట్ గోదావరి
- 316 పరుగుల భారీ స్కోర్ దిశగా కడప
- 162 పరుగులకే చేతులెత్తేసిన కర్నూలు



77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న శివప్రశాంత్



73 పరుగులు చేసిన ఫైజాన్ (కడప)



5 వికెట్లు తీసిన రేవంత్ (ఈస్ట్ గోదావరి)

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-14 మెన్స్ రెండు రోజుల మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా కేఓఆర్‌ఎం మైదానంలో విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.3 ఓవర్లలో కేవలం 112 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది.

తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 22.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 82 పరుగులు చేసింది. ఇందులో తమన్‌రెడ్డి 43 పరుగులతో, అక్షిత్‌రెడ్డి 35 పరుగులతో క్రీజ్‌లో వున్నారు.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 316 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో లోకేష్ 53, ఫైజాన్ 73 పరుగులు చేసి ఔట్ కాగా శివ ప్రశాంత్ 77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో

కర్నూలు-ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో 78.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 162 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 72 పరుగులు చేశారు. ఇక బౌలింగ్ విభాగంలో ఈస్ట్‌గోదావరి జట్టు బౌలర్ రేవంత్ 5 వికెట్లు పడగొట్టి గట్టి దెబ్బతీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. ఇందులో కార్తీక్ 28 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 98 పరుగుల వెనుకంజలో ఈస్ట్ గోదావరి జట్టు ఎదురీదుతోంది.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.కోటి

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ వివిధ ప్రాంతాలకు రాను, పోను సుమారు 390 ప్రత్యేక బస్సులను సమకూర్చామని వీటి ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు విజయవాడకు రాను పోను 53 బస్సులు, బెంగళూరుకు 128, హైదరాబాదుకు 99, చెన్నైకి 22, తిరుపతికి 51, కర్నూలుకు 8, ఇతర ప్రాంతాలకు మరో 29 బస్సులు తిప్పామన్నారు. మొత్తంగా 390 బస్సులు నడిపామని వీటిద్వారా రూ.1,02,84,721 ఆదాయం వచ్చిందని అన్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌కు తిప్పడం ద్వారా రూ.30,71,411 ఆదాయం రాగా.. బెంగళూరుకు తిప్పడం ద్వారా రూ.30,48,665 వచ్చిందన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు పోటాపోటీ

● నామినేటెడ్ పదవుల పందేరంలో ఆశావహులు ● ఆచితూచి అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, అక్టోబరు 22: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకుకోవడానికి చాలా మంది ఆశావహులు పోటీలో వున్నట్లు సమాచారం. మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల పరిధిలో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేందుకు ఏడు దశాబ్దాల క్రితం మదనపల్లె మార్కెట్ కమిటీ ఏర్పాటు చేశారు. అప్పట్లో కురబలకోట, బి.కొత్తకోట మండలాలు కూడా ఈ కమిటీ కిందే ఉండేవి. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బి.కొత్తకోట, అంగళ్లు మార్కెట్ కమిటీలను మదనపల్లె నుంచి విభజించగా, ఇప్పుడు మూడు మండలాలే మిగిలాయి.



మదనపల్లె మార్కెట్ కమిటీ కార్యాలయం

అధిక ఆదాయం..ఎమ్మెల్యే స్థాయి పదవి

మదనపల్లె మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్ యార్డులో దేశంలోనే అత్యధికంగా టమోటా విక్రయాలు జరుగుతాయి. సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా ఇక్కడ టమోటా విక్రయాలు జరుగుతాయి. ఏడాదికి మార్కెట్ సెస్సు రూపంలోనే రూ.2 నుంచి రూ.3 కోట్ల లక్ష్యంగా ఉంటుంది. వాటికి అదనంగా మండీల లైసెన్సులు, షాపింగ్ గదుల ఆదాయం పెరుగుతోంది. ఈ క్రమంలో మదనపల్లె మార్కెట్ కమిటీ నియామకంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా మూడు మండలాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్‌చైర్మన్, డైరెక్టర్ల పదవులను ఎవరికి కేటాయిస్తే సముచితంగా ఉంటుందో ఎమ్మెల్యే విచారిస్తునట్లు తెలిసింది.

నామినేటెడ్ పదవుల పందేరంలో ఆశావహులు

మదనపల్లె ఎమ్మెల్యే పదవి ముస్లీం మైనారిటీలకు వరించడంతో, అదే స్థాయి పదవి అయిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఈ సారి బీసీ, కాపు(రెడ్డి), బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికే దక్కే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో తొలి నుంచి టీడీపీలో ఉంటూ, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ చేరినప్పటి నుంచి ఆయన వెన్నంటే నడిచిన పలువురు మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఆశపడుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా జనసేన, బీజేపీ నాయకులు కూడా తమ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ పదవి ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

తవ్వకాలపై అధికారుల పరిశీలన

గుర్రంకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):గుప్తనిధుల ముఠా సభ్యులు తవ్వకాలు చేసిన ఆంజనేయస్వామి ఆలయాన్ని అన్నమయ్య జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం గుప్తనిధుల కోసం తవ్వకాలు అన్న శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గుర్రంకొండ తుపాకుల చెరువు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించి తవ్వకాలు గురించి రైతులు, స్థానికులను అడిగి వివరాలను సేకరించారు. అనంతరం పోలీసులతో మాట్లాడి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ మధురామచంద్రుడుని కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాల తనిఖీ

మదనపల్లె అర్బన్, అక్టోబరు22:(ఆంధ్రజ్యోతి) స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మున్సిపల్ వివేకానంద ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో శివప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడ జరిగే విద్యాభాసం, మధ్యాహ్న భోజనం సౌకర్యాలను, ఉపాధ్యాయుల పని తీరును విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యంగా రైతుబజార్

● తోపుడుబండ్లకు గేట్లు లేవు ● రైతుబజార్ పరిశీలనలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



రైతుబజార్‌లో సౌకర్యాలను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో ఆధునీకరించిన రైతుబజార్‌లో రైతులు, వ్యాపారులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైతు బజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ ఏర్పాట్లు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఉత్పత్తి చేసే కూరగాయలు, ఫలాలు, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు తదితర వాటికి రైతుబజార్‌లో గేట్లు, రుసుం వసూలు చేయరన్నారు. అలాగే ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను రైతులకు ఉచితంగా కేటాయిస్తారన్నారు. మాంసం దుకాణాలు, చేపల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్న వారికి, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి స్టాళ్ల అద్దెకు నెలకు రూ.4వేలతో పాటు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. రైతుబజార్‌లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య పనులను మున్సిపాలిటీ సిబ్బంది చూసుకుంటారన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ ఏడీఎం త్యాగరాజు మాట్లాడుతూ రైతు బజార్‌లో స్టాళ్ల కేటాయింపుపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో రైతులకు కేటాయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, కౌన్సిలర్ నాగార్జునగాంధీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిని చూసే సర్పంచ్‌లు టీడీపీ బాట..

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసే వైసీపీ సర్పంచ్‌లు టీడీపీలో చేరుతున్నారని నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థాని క నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు విలే కర్లతో మాట్లాడుతూ రాచవేటివారిపల్లె సర్పంచ్ మధు టీడీపీలో చేరడంపై కొందరు వైసీపీ నాయ కులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్‌తో సంప్రదించాకే సర్పంచ్ మధు టీడీపీలో చేరారని, ఆయనను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మనస్ఫూర్తిగా ఆహ్వానించారన్నారు. రాచవేటివారిపల్లె గ్రామ అభివృ ద్ధికి ఎమ్మెల్యే సహకారాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్, శివ కృష్ణ, రవి, మనోహర్‌రెడ్డి, భార్గవ్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు నిబంధనలు తప్పనిసరి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు అనుగుణంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మిషన్ కాంపౌండు, బీటీ కళాశాల మైదానంలో ఉన్న స్థలాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం పాటించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో రెండు చోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై చర్చిస్తున్నామన్నారు. దీంతో పాటు మిషన్ కాంపౌండు మైదానంలోకి అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు సాధ్యాసాధ్యాలపై ఫైర్ ఆఫీసర్ శివన్నతో చర్చించారు. ప్రతి దుకాణం ఎదుట బారి కేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు దుకాణాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దుకాణాల వద్ద ఇసుక బకెట్ల ఏర్పాటుకు తగినంత ఇసుకను చేర్చాలని తహసీల్దార్ ఖాజాబీని సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా, బాణసంచా దుకాణదారులు పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన పక్కాఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాల ని ప్రత్యేకాధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవా రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డితో కలసి హౌసింగ్, సచివాలయ సిబ్బం దితో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. మండలంలో గత రెండు వారాలుగా ఇళ్ల నిర్మాణాల ప్రగతి తక్కువగా ఉందని.వచ్చే వారానికి నిర్మాణా లన్నీ స్టేజ్ కన్వర్షన్ స్థాయిలో ఉండాలన్నారు. ఆర్‌ఎల్, ఆర్‌సీ స్టేజీలలో ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్న ఇళ్లు 516 ఇళ్లు ఉన్నాయని డిసెంబరు చివరికి పూర్తి చేసే లా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ సుజాత, పీఆర్ ఏఈ హరి, ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యల సవరణకు రెవెన్యూ గ్రామ సభలు

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి బుధవారం నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు మహేశ్వరీ బాయి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కె.రెడ్డివారిపల్లె, మర్రికుంటపల్లె గ్రామాల్లో తప్ప మిగిలిన 12 గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు వివరించారు. ఈ గ్రామాల్లోని రైతులు ఆయా తేదీల్లో గ్రామ సభలకు హాజరయి సమస్యలను రెవెన్యూ అధికార్ల దృష్టికి తీసుకురావాలని కోరారు. బుధవారం సంద్రావారిపల్లె, 24వ తేదీ మహల్, 25, 26 తేదీల్లో పారపట్ల, 29న మునేళ్ళపల్లె, 30న చీకటిపల్లె, నవంబరు 2న కొర్లకుంట, 4న పల్లవోలు, 5న పత్తేగడ, 6న కలికిరి, 7, 8 తేదీల్లో గుట్టపాలెం, 12, 13 తేదీల్లో గుండ్లూరు, 14, 15వ తేదీల్లో మేడికుర్తి గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దారు వివరించారు.

ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఐదో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రైనింగ్ అధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండేళ్ల వ్యవధి గల ఫిట్టర్, సివిల్ ట్రేడ్లలో ఖాళీలున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 26 లోగా తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తులు సమర్పించాలని టీవో కోరారు.

లో వోల్టేజీ సమస్య తీర్చండి

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుట్టపాలెం పంచాయతీలో లో వోల్టేజీ సమస్య తీర్చాలని సర్పంచు ఆర్. వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీ శివారు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు కూడా పనిచేయడం లేదని చెప్పారు. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ ముజిబుర్ రహ్మాన్ మాట్లాడుతూ కొన్ని విద్యుత్ పరికరాలు అందుబాటులో లేనందువల్ల సమస్య ఉత్పన్నమైందని తొందరలోనే పూర్తి స్థాయిలో సరఫరా కొనసాగిస్తామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్యం పరిస్థితి ఘోరంగా ఉందని పలువురు సభ్యులు వాపోయారు. మహల్ రోడ్డు గుంతలమయంగా ఉందని అద్దవారిపల్లె సర్పంచు గంగయ్య సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో భానుమూర్తి రావు మండల పరిషత్తు నిధులతో చేపట్టిన పనులను ఆమోదించాల్సిందిగా చేసిన ప్రతిపాదనకు సభ్యులు స్పందించారు.

ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు

నిమ్మనపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ కొరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో తప్పులు, అడ్రస్‌లు వంటివి మార్చుకొనే వీలువుంటుందని తెలిపారు. ఆధార్ సెంటర్ ద్వారా విద్యార్థులకు సమయపాలన ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి.విష్ణువర్దన్ తిరుపతిలో నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి 74 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. అలాగే మరో విద్యార్థి అమీన్ 54 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ శరత్‌నాయక్ అభినందించారు.

నీటి సమస్య తీరేదెప్పుడో..?

● రహదారి విస్తరణ పనుల్లో పైప్‌లైన్ తొలగింపు
● ఏడాదిగా నీటి సమస్య
●ట్యాంకర్లతో కొనుగోలు...డ్రమ్ము నీరు రూ.50

ములకలచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రమ్ము నీరు రూ.50 పెట్టి కొంటున్నారు. ఏడాదిగా ఈ సమస్య ఏర్పడింది ఎక్కడో మారుమూల గ్రామాల్లో కాదు. మండలం కేంద్రమైన ములకలచెరువులోని మదనపల్లె రోడ్డులో నివాసముంటున్న కుటుంబాలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడైనా గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడితే సమీప వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్ళి తెచ్చుకుంటారు. ఇక్కడున్న స్థానికులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్ళే అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే మండల కేంద్ర కావడమే. దీంతో గత్యంతరం లేక డబ్బు పెట్టి మరీ నీటిని కొనుగోలు చేస్తున్నారు. ములకలచెరువులోని మదనపల్లె రోడ్డులో ముంబాయి - జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 50 కుటుంబాల వరకు నివాసముంటున్నారు. స్థానిక పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సుమారు అర కిలో మీటరు దూరంలో ఉన్న రైల్వేగేటు వరకు ఉన్న గృహాలకు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేవారు. ఏడాడి క్రితం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా ఉన్న పైప్‌లైన్‌ను యంత్రాల సహాయంతో తవ్వేశారు. అప్పట్లో తిరిగి పైప్‌లైన్ వేసి నీరు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పైప్‌లైన్ తొలగించి ఏడాడి అవుతున్నా పట్టించుకునే నాధులే కరువయ్యారు. దీంతో ఒక్కో ట్యాంకర్ నీరు రూ.500 పెట్టి కొంటున్నారు. ఇక పేదలు రూ.50 పెట్టి డ్రమ్ము నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏడాడి ఇలా డబ్బులు పెట్టి నీరు కొంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించాని మండల ప్రజాపరిషత్, గ్రామ సచివాలయం చుట్టూ కళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. సంబంధిత ఉన్నతాధికారులులైనా చొరవ తీసుకుని నీటి సమస్యను పరిష్కరించాలని మదనపలెల రోడ్డు వాసులు వేడుకుంటున్నారు.

ఆలస్యంగా నడిచిన తిరుపతి - గుంతకల్లు రైలు

ములకలచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గుంతకల్లుకు రాత్రి సమయంలో నడిచే ప్యాసింజర్(ప్రత్యేక చార్జీలు) రైలు ఏకంగా మూడు గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. సాంకేతిక కారణాలతో ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 4.57 గంటలకు వచ్చింది. అలాగే ఈ రైలు పీలేరుకు తెల్లవారుజామున 12.44 గంటలకు రావాల్సి ఉండగా 3.48 గంటలకు, మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 1.09 గంటలకు రావాల్సి ఉండగా 4.24 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడి రైలు కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ రైలు తరచూ ఆలస్యంగా నడుస్తోందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రీసర్వేపై రైతులనుంచి 136 అర్జీలు

బి.కొత్తకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేపై రైతులు వివిధ సమస్యలు, అభ్యంతరాలపై 136 అర్జీలను అధికారులకు అందజేశారు. బి.కొత్తకోట మండలంలోని కోటావూరు రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఒక సర్వేనంబరులో విస్తీర్ణంలో తేడాలు, మరణించిన వారి భూముల వివరాలను వారి వారసులకు మ్యుటేషన్ చేయని ఖాతానెంబర్లు, తదితర ఆరు రకాల సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ మాట్లాడుతూ గ్రామసభలో రైతులు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తామని, సాధ్యమైనంత త్వరగా వాటి పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వో నరేంద్రకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న కుషావతి నది

●అప్రమత్తమైన అధికారులు

పెద్దమండ్యం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలో ఎగవ ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కుషావతినది రోడ్డుపై ప్రవహించింది. దీంతో స్థానిక తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అప్రమత్తమై వాహన రాకపోకలను నిలిపివేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రవాహం తగ్గుముఖం పట్టే వరకు రెవెన్యూ సిబ్బంది అక్కడే ఉండి ప్రజలు ఎవ్వరూ అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇకనైన కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులు చర్యలు తీసుకొని కుషావతిపై త్వరలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐ కోర్సులతో సత్వర ఉపాధి

తంబళ్లపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులతో ప్రభుత్వ ప్రవేటు రంగ సంస్థలలో సత్వర ఉపాధి పొందవచ్చని తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి, డీఆర్‌డీఏ సీడప్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముత్తూట్ ఫైనాన్స్, యంగ్ ఇండియా కంపెనీలు హాజరు కాగా..జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి సుమారు 36 మంది హాజరవ్వగా ఇందులో ప్రతిభ చూపిన 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ , కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 46 మంది ఎంపిక

పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడప్, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన మినీ జాబ్ మేళాలో 46 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, యంగ్ ఇండియా, క్రెడిట్ యాక్సెస్ సంస్థలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు 85 మంది హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి దోనప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్, కో-ఆర్డినేటర్ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ కోసం పాదయాత్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు22 (ఆంధ్ర జ్యో తి): వాల్మీకులను ఎస్టీ పునరుద్ధరణ కోసం బోయకొండ గంగమ్మ ఆలయానికి నిర్వహి స్తున్న పాదయాత్రను విజయవంతం చేయా లని ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులిశ్రీనివాసులు పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు నుంచి మదనపల్లె, పుంగ నూరుల మీదుగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో బోయకొండకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లెలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ సాధన కోసం బోయకొండకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబుకు వినతిపత్రం అందిస్తున్నట్లు తెలిపారు. వాల్మీకులు అందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి వైద్యం చేపడితే కఠిన చర్యలు తప్పవని మేడికుర్తి వైద్యాధి కారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప స్పష్టం చేశారు. ఈ వైద్యం చేయడంలో పీ ఎంపీ, ఆర్ఎంపీ వైద్యులకున్న పరిమి తుల గురించి అవగాహన కల్పించ డానికి మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు ప్రాథమిక చికిత్స మాత్రమే అందజేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు వారిని పంపాలన్నారు. సీజనల్ వ్యాధులతో వైద్యం కోసం వచ్చే వారికి రెండు రోజులకు మించి వైద్యం చేయరాదని, వారందరినీ ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. సమావేశంలో మలేరియా యూనిట్ ఆఫీసర్ ముజీబ్ బాషా, క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారులు డీపీఎస్ సుబ్బయ్య, పీపీఎం ప్రణీత్, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, మురళి, ఎస్టీఎల్ఎస్ భూపతి, హెల్త్ అసిస్టెంట్ షఫీబుల్లా, పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండ్యం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) వర్షా లు కురుస్తున్నందున ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దమండ్యం ఎంపీ డీవో శ్రీధర్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ హరివర్మ పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాల యంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాలల్లో తాగునీటి పైపులైన్లు, తాగునీటి ట్యాంకులు లీకేజీలు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్లకు సంప్రదించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, పీహెచ్‌సీ సీహెచ్‌వో క్రిష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలి

కురబలకోట, అక్టోబరు 22: తక్కువ పెట్టుబడితో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని జేడీ చంద్రానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కురబలకోటలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశ నగ పంటకు సకాలం లో వర్షం కురవకపోవడంతో దిగుబడి తగ్గిందన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో. రాధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

వాల్మీకిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్యేయమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లకు భూమి పూజలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, నాయకులు పులి సత్యారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గంగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సతీష్, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా నెహ్రూ యువ కేంద్రం, గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపం లేకుండా జాగ్రత్త వహించాలి

గుర్రంకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):చిన్నపిల్లల్లో అయోడిన్ లోపం రాకుండా జాగ్రత్త వహించాలని వైద్యాధికారి డాక్టర్ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంతో వచ్చే రోగాలను గురించి వివరించారు. విద్యార్థినులు అయోడిన్ లోపించకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మహ్మద్ రఫీ, నాగరాజ, జయలక్ష్మీ, ప్రిన్సిపాల్ శిరీషాలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కిశోర్ సాయం

పీలేరు/కలకడ, అక్టోబరు 22 : కలకడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తక్షణ అవసరాల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆయన సాయం అందించారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న వెంటనే ఆయన మంగళవారం ఉదయం తన వ్యక్తిగత కార్యదర్శి సత్య, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, టి.సంద్రావారిపల్లె మాజీ సర్పంచ్ జబ్బార్ సాహెబ్, నాయకులు ముస్తఫా హజరత్, సనావుల్లా, ముజితబ, డాక్టర్ రఫీ, దూదేకులపల్లె సర్పంచ్ ఖాదర్ వలీ, కలికిరి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అస్లాం, నాయకు లు మున్నా, రెడ్డప్పరెడ్డి, పవన్ కుమార్‌లను అప్రమత్తం చేశారు. వారు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పోలీసులు, వైద్యులతో సమన్వ యం చేసుకుని మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను స్వగ్రామాల కు తరలించేందుకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున నగదు అందించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు ఆతిఖా షఫీ, పఠాన్ మౌలా, మనోహర, పసుపులేటి లక్ష్మీకర పాల్గొన్నారు. ఎమ్మెల్యే వచ్చిన వెంటనే దూదేకులపల్లెను సందర్శిస్తారని, ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల వారిని ఆదుకుంటారని ఆయన పీఏ సత్య పేర్కొన్నారు. కలకడ సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు పీలేరు ఆసుపత్రికి చేరుకుని అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి పోస్టుమార్టంకు సహకరించారు.



ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్న ఆయన పీఏ సత్య, టీడీపీ నాయకులు